/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి | శుక్రవారం • 24-3-2023 • సంపుటి:7 • సంచిక:78 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

చైత్రమాసం, శుక్రవారం, తిథి: తదియ, సా. 5.00 వరకు, నక్షత్రం: అశ్విని, మ.1.22 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: రా.10.57-12.32 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.58-మ.12.46 వరకు, రాహుకాలం: ఉ.10.52-12.22 వరకు

## 140 రోజుల తర్వాత అత్యధిక కరోనా కేసులు

2



## అప్పు చెల్లించకుండా.. విదేశాల్లో మాల్యా ఆస్తులు కొన్నాడు

### ఛార్జ్‌షీట్‌లో వెల్లడించిన సీబీఐ



ముంబయి, మార్చి 23: భారతీయ బ్యాంకుల నుంచి రూ. వేల కోట్ల రుణాలు తీసుకొని విదేశాలకు పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా ఉద్దేశపూర్వకంగానే ..మిగతా 2లో

# పోలవరం కోసమే ప్రధానిని కలిశా

### పోలవరం గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు

### ప్రాజెక్టును పూర్తి చేసేది మేమే

### సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి



అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): పోలవరం ప్రాజెక్టు కోసం టీడీపీ అధినేత చంద్రబాబు చేసిందేమీ లేదని, పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత కూడా ఆయనకు లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం పనులన్నీ చంద్రబాబే చేశారని ఎల్లో మీడియా వార్తలు రాస్తోందని విమర్శించారు. 1995 నుంచి 2014 వరకు చంద్రబాబు నోట ఒక్కసారి కూడా పోలవరం మాట రాలేదని అన్నారు. పోలవరంలో ఎక్కువ డబ్బులు వచ్చే పనులను ముందు చేశారని, ఆ తర్వాత తక్కువ డబ్బులు వచ్చే పనులు చేశారని చెప్పారు. కాఫర్ డ్యామ్ లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. టీడీపీ అనాలోచిత నిర్ణయాల వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదని చెప్పారు. చంద్రబాబు ధ్యాస మొత్తం డబ్బుపైనే అని ఆరోపించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పోలవరం తన కలల ప్రాజెక్టు అని వైఎస్సార్ చెప్పారని... ఆ ప్రాజెక్టును ప్రారంభించింది తన తండ్రేనని జగన్ చెప్పారు. పోలవరం పనుల్లో రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.800 కోట్లు ఆదా చేశామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 48 గేట్లు పూర్తి చేశామని చెప్పారు. సీడబ్ల్యూసీ సిఫారసుల మేరకు తొలిదశలో పోలవరం డ్యామ్ ను 41.15 మీటర్ల ఎత్తు వరకు కడతామని... ఆ తర్వాత 45.7 మీటర్ల ఎత్తు వరకు డ్యామ్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడటానికే ప్రధాని మోదీని కలిశానని చెప్పారు. ప్రాజక్టు తాత్కాలిక పనుల కోసం రూ. 15 వేల కోట్లు అడిగానని తెలిపారు.

## 'పోలవరం' ఎత్తు ప్రస్తుతానికి 41.15 మీటర్లకే పరిమితం

### పార్లమెంట్‌లో స్పష్టం చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, మార్చి 23: ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతానికి పోలవరం ఎత్తు 41.15 మీటర్లకే పరిమితమని తేల్చి చెప్పింది. పార్లమెంటులో వైసీపీ ఎంపీ సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయమంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తొలిదశలో 41.15 మీటర్ల మేరకే పోలవరంలో నీటిని నిల్వ చేయనున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. తొలిదశ సహాయ, పునరావాసం అంతవరకేనని స్పష్టం చేశారు. తొలిదశ సహాయ, పునరావాసం మార్చి 2023 నాటికే పూర్తి కావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, తొలిదశలో 20,946 నిర్వాసిత కుటుంబాలకే సహాయ, పునరావాసం ఖరారైందని వెల్లడించారు. ఇప్పటివరకు కేవలం 11,677 నిర్వాసిత కుటుంబాలకే సహాయ, పునరావాసం కల్పించినట్లు తెలిపారు. సహాయ, పునరావాసం మార్చి నాటికే పూర్తి కావాల్సి ఉన్నా... అందులో కూడా జాప్యం జరిగిందని కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా వివరించారు.

## త్వరలో మరో పెద్ద నివేదిక

### హిండెన్‌బర్గ్ కీలక ప్రకటన




వాషింగ్టన్, మార్చి 23: అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసి వెలుగులోకి వచ్చిన అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్.. తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. త్వరలో మరో కీలక నివేదికను విడుదల చేయనున్నామని గురువారం ప్రకటించింది. అయితే, అది దేనిపై అనే వివరాల్ని మాత్రం వెల్లడించలేదు. అలాగే ఎప్పుడో కూడా కచ్చితంగా చెప్పలేదు. కేవలం ''త్వరలో మరో పెద్ద నివేదిక'' అని మాత్రమే ట్వీట్ చేసింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైనప్పటి నుంచి అదానీ గ్రూప్ నమోదిత కంపెనీల షేర్లు భారీ ఎత్తున నష్టపోయిన విషయం తెలిసిందే. గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ 140 బిలియన్ డాలర్లకు పైగా ఆవిరైంది. అంతకుముందు గౌతమ్ ..మిగతా 2లో

## కరిగిపోతున్న హిమానీనదాలు

### ముంచుకొస్తున్న ముప్పు

### ఐక్యరాజ్య సమితి హెచ్చరిక




న్యూఢిల్లీ, మార్చి 23: ఉత్తర భారతదేశానికి జీవనాధారాలుగా పిలుచుకునే సింధు, గంగా, బ్రహ్మపుత్ర నదుల విషయంలో ఐక్యరాజ్యసమితి సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా హిమానీనదాల తిరోగమనం వల్ల రాబోయే దశాబ్దాలలో భారతదేశానికి కీలకమైన ..మిగతా 2లో

## ఆరుగురు గెలిచారు.. ఆయన మాత్రం ఓడారు

### ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రకటన




అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఉత్కంఠరేపిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. అయితే, ఈ ఎన్నికల్లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆరు స్థానాలను కైవసం చేసుకుంది. అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ బరిలోకి దింపిన అనురాధ 23 ఓట్లు సాధించి విజయం సాధించారు. ఏడు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఏడుగురిని బరిలోకి దింపితే.. వైసీపీ అభ్యర్థి కోలా

## వైసీపీ పతనం ప్రారంభమైంది

### రానున్న ఎన్నికల్లో వారికి సింగిల్ డిజిటే

### టీడీపీ నేతల ఆనందోత్సాహాలు



అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధించడంపై ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. చంద్రబాబు నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ మిఠాయిలు పంచుకున్నారు. విజయం సాధించిన అనురాధను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభినందించారు. సీఎం జగన్‌పై విరుచుకు పడ్డారు. ''మేం 23 సీట్లే గెలిచామని ఎద్దేవా చేశారు. అందులో నలుగురిని సంతలో పశువుల్లా కొన్నారు. చివరికి అదే 23వ తేదీన అదే 23 ఓట్లతో మీ ఓటమి.. మా గెలుపు. ఇది కదా దేవుడి స్క్రిప్ట్ అంటే..'' అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు. టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం పట్ల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. వైకాపా పతనం ఆరంభమైందని అన్నారు. 23 ఓట్లతో విజయం సాధించినా.. ప్రకటనలో జాప్యం చేశారని మండిపడ్డారు. ''ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెడితే.. అనవసరంగా పోటీ పెట్టారంటూ ఇష్టారీతిన ఆరోపించారు. మా ఎమ్మెల్యేల మీద కూడా నిఘా పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా

## అశ్లీల సందేశాలు.. పాక్ నుంచి ఆయుధాలు

### బయటకొస్తున్న అమృత్‌పాల్ నేరాల చిట్టా..!



ఛండీగఢ్: ఖలిస్థానీ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్ కోసం పోలీసులు వేటను కొనసాగిస్తున్నారు. అలాగే అతడి గత చరిత్రను మొత్తం తవ్వితీస్తున్నారు. అతడి దేశ వ్యతిరేక అజెండాను కూడా ఇంటెలిజెన్స్ వర్గాలు బట్టబయలు చేసేపనిలో ఉన్నాయి. తరచూ ఖలిస్థాన్ గురించి మాట్లాడే అమృత్‌పాల్‌కు చాలా మంది మహిళలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించి మహిళలతో ఛాటింగ్‌లు, వాయిస్ నోట్‌లు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే 12 వాయిస్ నోట్లు ఓ మీడియా సంస్థ చేతికి వచ్చాయి. వాటిల్లో మహిళలతో టైంపాస్ ..మిగతా 2లో

## హైకోర్టు తరలింపు న్యాయస్థానాల పరిధిలోనే

### న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్ణయం తీసుకోవాలి

### పార్లమెంట్‌లో స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం




న్యూఢిల్లీ, మార్చి 23 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం హైకోర్టు అమరావతిలో ఏర్పాటైందని కేంద్ర న్యాయ శాఖ స్పష్టం చేసింది. కర్నూలుకు తరలిచాలంటే హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం కలిసే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఈ మేరకు రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లిఖితపూర్వక సమాధానం ..మిగతా 2లో

## దేవాదాయ శాఖ చరిత్రలో శుభదినం

### శ్రీశైలంలో సరిహద్దు సమస్య పరిష్కారం

### దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ




అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): దేవాదాయ, ధర్మాదాయ శాఖ చరిత్రలో ఈ రోజు శుభదినంగా పేర్కొన్నారు మంత్రి కొట్టు సత్యనారాయణ. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం దేవస్థానం సరిహద్దు సమస్యకు పరిష్కారం దొరికిందని.. రెండో ప్రధాన ఆలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని తెలిపారు. అటవీశాఖతో చాలా కాలంగా భూవివాదం కొనసాగుతోంది. ..మిగతా 2లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి షాక్..

### టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం

2



## కొందరు ఎమ్మెల్యేలు చంద్రబాబు ప్రలోభాలకు గురయ్యారు

### ఆనం, కోటంరెడ్డి టీడీపీకి ఓటు వేసి ఉంటారు

### క్రాస్ ఓటింగ్ విషయాన్ని పార్టీ పెద్దలు చూసుకుంటారు

### వైసీపీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్‌పై సజ్జల స్పందన



అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ సభ్యురాలు పంచుమర్తి అనురాధ ఘన విజయం సాధించారు. అనురాధకు నలుగురు వైసీపీ ఎమ్మెల్యేల క్రాస్ ఓట్లు పడ్డాయి. క్రాస్ ఓటింగ్ జరగడంతో వైసీపీ నాయకత్వం షాక్‌కు గురయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఇలాంటి రాజకీయాలు చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని అన్నారు. తెలుగుదేశం పార్టీలో తొలి నుంచి ఆయన ఇలాంటి పనులు చేస్తూనే ఉన్నారని... ఈ విషయం ప్రజలందరికీ తెలుసని చెప్పారు. ఈ ఎన్నికల్లో కూడా ఆయన తన నేర్పరితనాన్ని చూపారని అనుకుంటున్నామని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏడు స్థానాలు గెలుస్తామనే భావించామని... అయితే చంద్రబాబు ..మిగతా 2లో

## పవన్ సీఎం అవ్వాలని దేవుడు రాసిపెట్టి ఉంచాడు

### ఆయనకున్న ఫాలోయింగ్ ఎవ్వరికీ లేదు

### సినీ హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు



2

## దేశ రాజధానిలో 'పోస్టర్' వార్..!




న్యూఢిల్లీ: దేశ రాజధానిలో కొంతకాలంగా ఆమ్‌ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. మొన్నటి వరకు స్థానిక ఎన్నికలు, నేతలపై కేసుల విషయంలో వివాదం చోటు చేసుకోగా.. తాజాగా అగ్రనేతల పోస్టర్ల వ్యవహారం దుమారం రేపుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఇటీవల పోస్టర్లు వెలిసిన రెండు రోజులకు కేజ్రీవాల్ వ్యతిరేక పోస్టర్లు కనిపిస్తున్నాయి. 'అరవింద్ కేజ్రీవాల్ హఠావో ..మిగతా 2లో

### మంచిమాట

మీరు ఒక పనిని చేయగలను అని నమ్మితే సగం పని పూర్తయినట్లే.

శుభోదయం

మనం



## 140 రోజుల తర్వాత అత్యధిక కరోనా కేసులు

న్యూఢిల్లీ, మార్చి 23: భారతదేశంలో మరోసారి కరోనా పడగవిప్పుతోంది. నెమ్మదిగా కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తోంది. కొన్నాళ్ల క్రితం కేసుల సంఖ్య కేవలం వెయ్యికి దిగువన మాత్రమే ఉండేవి. అయితే తాజాగా కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించిన గణాంకాల ప్రకారం గత రెండు రోజుల్లో 1000 పైగా కేసులు నమోదు అయ్యాయి. గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 1300 కరోనా కేసులు నమోదు అయ్యాయి. 140 రోజుల తర్వాత ఇదే అత్యధికం. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల్లో ఒక్కొక్కరు మరణించారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 5,30,816కి పెరిగింది. దేశంలో ఇప్పటి వరకు 4.46 కోట్లు (4,46,99, 418) కరోనా కేసులు నమోదు అయ్యాయి. వీరిలో 4,41,60,997 మంది మహమ్మారి బారి నుంచి కోలుకున్నారు. యాక్టివ్ కేసుల సంఖ్య 7,605కు చేరింది. డైలీ పాజిటివిటీ రేటు 1.46 శాతం ఉండగా.. వీక్లీ పాజిటివిటీ రేటు 1.08 శాతంగా ఉంది. మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.02 శాతం ఉండగా.. రికవరీ రేటు 98.79 శాతంగా ఉంది. ఇప్పటి వరకు 92.06 కోట్ల పరీక్షలు నిర్వహించారు. గడిచిన 24 గంటల్లో 89,078 చేశారు. మొత్తం మరణాల శాతం 1.19 శాతంగా ఉంది. దేశంలో వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా 220.65 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్లు అందించారు.

## అప్పు చెల్లించకుండా.. విదేశాల్లో మాల్యా ఆస్తులు కొన్నాడు

(మొదటిపేజీ తరువాయి)

ఎగవేతకు పాల్పడినట్లు సీబీఐ ఆరోపించింది. ఈ మేరకు ముంబయి కోర్టులో తాజాగా విదేశాల్లో మాల్యా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలతో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. 2015-16 మధ్య కాలంలో మాల్యా ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లలో రూ. 330 కోట్ల విలువైన ఆస్తులను కొనుగోలు చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఆ సమయంలో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొనసాగుతున్నప్పటికీ, మాల్యా విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేశారని తెలిపింది.కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం మాల్యా బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు అవసరమైన మొత్తం 2008, 2017లో ఆయన వద్ద ఉందని సీబీఐ పేర్కొంది. కానీ, ఆయన రుణం తిరిగి చెల్లించకుండా, వ్యక్తిగత ఆస్తులు కొనుగోలు చేయడంతో పాటు, కొంత మొత్తం నగదును స్విట్జర్లాండ్‌లోని తన పిల్లల ఖాతాల్లోకి బదిలీ చేశారని ఛార్జ్‌షీట్‌లో తెలిపింది. కోర్టు అనుమతితో వివిధ దేశాల్లో విజయ్ మాల్యాకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సీబీఐ సేకరించింది. వాటి ఆధారంగా ముంబయి కోర్టులో తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఫ్రాన్స్‌లో సుమారు 35 మిలియన్ యూరోల విలువైన ఆస్తిని కొనుగోలు చేసిన మాల్యా, దానికి 8 మిలియన్ యూరోలను తన బంధువులకు చెందిన జిజ్మో హోల్డింగ్స్ ద్వారా చెల్లించినట్లు సీబీఐ పేర్కొంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం ఐడీబీఐ బ్యాంకు నుంచి రుణం తీసుకుని మోసం చేసిన కేసులో విజయ్ మాల్యాతో పాటు బ్యాంకు మాజీ జనరల్ మేనేజర్ బుద్ధదేవ్ దాస్ గుప్తాను పేరును కూడా సీబీఐ తాజా ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. విదేశాల్లోని వివిధ సంస్థల నుంచి సేకరించిన ఆధారాల ప్రకారం 2008-2012 మధ్య కాలంలో ఫోర్స్ ఇండియా ఫార్ములా వన్ బృందానికి మాల్యా అధిక మొత్తంలో చెల్లింపులు చేశారని తెలిపింది. రూ.9వేల కోట్ల రుణ ఎగవేత ఆరోపణలతో దేశం విడిచి వెళ్లిపోయిన మాల్యా.. 2016 నుంచి యూకేలో ఉంటున్నారు. ఆయనను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అయితే, పలు కారణాలు చెబుతోన్న విజయ్ మాల్యా.. అక్కడే తలదాచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

## త్వరలో మరో పెద్ద నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

అదానీ అంతర్జాతీయ సంపన్నుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. తదుపరి గ్రూప్ కంపెనీలతో పాటు ఆయన వ్యక్తిగత సంపద సైతం కరిగిపోయింది. అదానీ గ్రూప్ తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని.. ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందని హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ మేరకు 2023 జనవరి 23న సుదీర్ఘ నివేదికను విడుదల చేసింది. పన్నుల విషయంలో స్నేహపూరితంగా ఉండే కరేబియన్ దీవులు, మారిషస్, యూఏఈ... తదితర దేశాల్లో అదానీ కుటుంబం పలు డొల్ల కంపెనీలను నియంత్రిస్తున్నట్లు ఆరోపించింది. వీటి ద్వారానే అవినీతి, అక్రమ నగదు బదలాయింపులకు పాల్పడుతున్నట్లు తెలిపింది. అదానీ గ్రూప్‌లోని మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్లతో పాటు డజన్ల కొద్దీ వ్యక్తులతో మాట్లాడి, వేలకొద్దీ పత్రాలను, దాదాపు ఆరు దేశాల్లో కంపెనీ కార్యాలయాలను పరిశీలించాకే ఈ పరిశోధన నివేదికను వెల్లడిస్తున్నామని హిండెన్‌బర్గ్ తెలిపింది.

## కరిగిపోతున్న హిమానీనదాలు

(మొదటిపేజీ తరువాయి)

సింధు, గంగా, బ్రహ్మపుత్ర వంటి హిమాలయ నదులలో నీటి ప్రవాహం తగ్గుతుందని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ హెచ్చరించారు. అంతర్జాతీయ హిమానీనదాల సంరక్షణ సంవత్సరం సందర్భంగా బుధవారం నిర్వ హించిన కార్యక్రమంలో గుటారెస్ ఈ ప్రకటన చేశారు. పాకిస్థాన్ తరహాలో వరదలు వస్తాయని హెచ్చరించారు.గుటెర్రెస్ మాట్లాడుతూ, 'భూమిపై జీవించడానికి హిమానీనదాలు చాలా అవసరం. ప్రపంచంలో 10 శాతం హిమానీనదాలు ఉన్నాయి. హిమానీనదాలు ప్రపంచానికి ప్రధాన నీటి వనరులు కూడా. మానవ కార్యకలాపాలు గ్రహం ఉష్ణోగ్రతను ప్రమాదకరమైన కొత్త స్థాయిలకు తీసుకువెళుతున్నాయని, కరిగిపోతున్న హిమానీనదాలు అత్యంత ప్రమాదకరమైనవి అని గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. అంటార్కిటికా ప్రతి సంవత్సరం సగటున 150 బిలియన్ టన్నుల మంచును కోల్పోతోంది. అయితే గ్రీన్‌లాండ్ మంచు మరింత వేగంగా కరుగుతోంది. అక్కడ ప్రతి సంవత్సరం 270 బిలియన్ టన్నుల మంచు కరుగుతోంది.ఆసియాలోని 10 ప్రధాన నదులు హిమాలయ ప్రాంతంలో ఉద్భవించాయి. దాని పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న 1.3 బిలియన్ల ప్రజలకు నీటిని సరఫరా చేస్తాయి. రాబోయే దశాబ్దాలలో హిమానీనదాలు, మంచు పలకలు తగ్గుముఖం పట్టడంతో, సింధు, గంగా, బ్రహ్మపుత్ర వంటి ప్రధాన హిమాలయ నదులు ప్రభావం చూపుతాయి. వాటి నీటి ప్రవాహం తగ్గుతుందని గుటెర్రెస్ చెప్పారు. హిమాలయాలపై కరిగిపోతున్న మంచు కారణంగా పాకిస్థాన్లో వరద పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో ప్రపంచం ఇప్పటికే చూసిందన్నారు. అదే సమయంలో సముద్ర మట్టాలు పెరగడం, ఉప్పు నీటి ప్రవేశం ఈ భారీ 'డెల్టా'లలోని పెద్ద భూ భాగాలను నాశనం చేస్తాయి. ఐక్యరాజ్యసమితి 2023 వాటర్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. వాటర్ కాన్ఫరెన్స్ లాంఛనంగా ఐక్యరాజ్యసమితి నీరు, పారిశుధ్యంపై చర్య కోసం దశాబ్దంలో (2018-2028) చేయవలసిన పనుల మధ్య-కాల సమీక్షను ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఈ సదస్సు ఇంకా కొనసాగుతోంది. తజికిస్థాన్, నెదర్లాండ్స్ దీనికి ఆతిథ్యం ఇస్తున్నాయి.

## వైసీపీ ఓటమికి కారణాలు ఇవే?

### ఆ ఇద్దరిపై వేటు తప్పదా..?... సంబరాల్లో టీడీపీ

అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ లో అధికార వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఒకప్పుడు అధినేత జగన్ మోహన్ రెడ్డి ఎంత అంటే అంత.. ఆయన కనుసైగ చేస్తే.. పార్టీలో ఎక్కడి వారు అక్కడ ఆగాల్సిందే.. ఆయన గీసిన గీత దాటడం అనే ప్రసక్తే ఉండేది కాదు.. అలాంటి సీఎం జగన్ మోహన్ రెడ్డికి సొంత పార్టీ నేతలే షాక్ ఇచ్చారు. పార్టీకి పూర్తి బలం ఉన్న చోట.. అస్సలు బలం లేని ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ సీటును టీడీపీ ఎగురవేసుకుపోయింది. గెలవడం కష్టం అనుకుంటే.. అనూహ్యంగా పంచమర్తి అనురాధ 23 ఓట్లతో అందరికి కంటే ముందే విజయాన్ని కైవసం చేసుకున్నారు.

# వైసీపీ పతనం ప్రారంభమైంది

(మొదటిపేజీ తరువాయి)

విందు రాజకీయాలు చేశారు. అయినా వాళ్లకు బుద్ధి చెప్పేలా టీడీపీ విజయం సాధించింది'' అని అచ్చెన్నాయుడు అన్నారు.

వైకాపా సింగిల్ డిజిట్‌కే: గోరంట్ల రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా కేవలం సింగిల్ డిజిట్కే పరిమితం కాబోతోందని తెదేపా సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ నియంతృత్వ పోకడలు ప్రజలకు అర్థమయ్యాయని, అందుకే ఆ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని చెప్పారు. తాజా ఎమ్మెల్సీ ఎన్నికలే అందుకు నిదర్శనమన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులకు తెలంగాణ ముఖ్యమంత్రి దాదాపు రూ.250 కోట్లు ప్రకటిస్తే.. జగన్ మాత్రం కార్యాలయం వదిలి బయటకు రాలేదని విమర్శించారు.

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్దాం: బాలకృష్ణఅనురాధ గెలుపు ప్రజా విజయమని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ఆమె విజయాన్ని అన్ని వర్గాల ప్రజల గెలుపుగా అభివర్ణించారు. ''క్లిష్ట ఎన్నికల్లో అనురాద సునాయాస గెలుపు స్ఫూర్తిదాయకం. పట్టభద్రుల ఎన్నికల్లోనూ తెదేపా 3 స్థానాల్లో విజయం సాధించింది. చంద్రబాబు పోరాట స్ఫూర్తి, కార్యకర్తల కృషి వల్లే వరుస విజయాలు సాధించగలిగాం. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి.. తెదేపాను విజయపథంలో నిలబెట్టడమే మనందరి కర్తవ్యం'' అని పార్టీ శ్రేణులకు బాలకృష్ణ పిలుపునిచ్చారు.

**ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు: ఆనంద్ బాబు**

దేశంలో ప్రజాస్వామ్యం గొప్పతనం ఇవాళ చూశామని తెదేపా నేత నక్కా ఆనందబాబు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేశారన్నారు. ''వైకాపా నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. వైకాపా హయాంలో ప్రజాప్రతినిధులకు విలువ లేదు. జగన్కు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ వైకాపాకు ప్రజలు గుణపాఠం చెబుతారు'' అని ఆనంద్‌బాబు అన్నారు.

వైకాపా ఎమ్మెల్యేల్లో అసంతృప్తి: చినరాజప్ప

''టీడీపీతో 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పాం. ఆత్మప్రబోధం మేరకు ఓటు వేయడంతో విజయం సాధించాం. పట్టభద్రుల ఎన్నికల్లోనూ 3 స్థానాల్లో గెలుపొందాం. వైకాపాపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. చాలా మంది వైకాపా ఎమ్మెల్యేలు జగన్‌పై అసంతృప్తితో ఉన్నారు'' అని చినరాజప్ప అన్నారు.

**కొత్త జోష్ వచ్చింది: కంభంపాటి**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ విజయం సాధించడం పట్ల రాజ్యసభ మాజీ సభ్యుడు, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్రావు అభినందనలు తెలిపారు. ఆమె విజయానికి కృషి చేసిన ఎమ్మెల్యేలకు, నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. '' తెదేపా కేడర్లో కొత్త జోష్ నింపే విజయమిది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీల గెలుపు ఇది. వైకాపా హింస, విద్వేషాలపై ఇది తిరుగుబాటు. ఇటీవల 3 స్థానాల్లో విజయం సాధించడంతోపాటు, తాజాగా బరిలో నిలిచిన ఏకైక స్థానంలోనూ విజయం సాధించడం తెదేపా పోరాట స్ఫూర్తికి అద్దంపడుతున్నాయి'' అని కంభంపాటి తెలిపారు.

**జగన్‌కు ఇదే రిటర్న్ గిఫ్ట్ :గంటా**

దేశ ప్రజలందరూ ఆనందంతో ఉన్నారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''ఇది 2023వ సంవత్సరం, 23వ తేదీ, 23 ఓట్లతో గెలిచాం. ఇదే జగన్‌కి రిటర్న్ గిఫ్ట్. ఉత్తరం లేదు.. దక్షిణం లేదు.. పట్టభద్రుల ఎన్నికల్లో దుమ్ము దులిపారు. 9 జిల్లాల్లో 108 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తెదేపా ప్రభంజనం కనిపించింది. తెదేపాకు ఆకర్షణ తెచ్చింది. మొన్న పట్టభద్రుల ఎన్నికలను సెమీఫైనల్ అన్నారు. అందులోనే ఓడిపోయారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు. జగన్ ఒక్క ఛాన్స్ అంటే ఇచ్చారు.. అది పూర్తయింది. ఇక జగన్ అంతం ప్రారంభమైంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపాకు పట్టంకట్టడం ఖాయం'' అని గంటా శ్రీనివాసరావు అన్నారు.

## పవన్ సీఎం అవ్వాలని దేవుడు రాసిపెట్టి ఉంచాడు

అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): పవన్ కళ్యాణ్ .. పవర్ స్టార్ ట్యాగ్ వదిలి జనసేనాని అనే ట్యాగ్‌తోనే జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. పదేళ్ల నుంచి పవన్ కళ్యాణ్.. ఏపీ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉంటూ ప్రజలకు ఎంతో కొంత మంచి చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈసారి ఎన్నికల్లో పవన్ సీఎం అయ్యే సూచనలు ఎక్కువ కనిపిస్తున్నాయని ఏపీ ప్రజలు చెప్పడం గమనార్హం. ఇక ఇంకోపక్క ఇండస్ట్రీలోని పెద్దలు సైతం పవన్ కళ్యాణ్‌కు మద్దతు పలకడం విశేషం. తాజాగా పవన్ కళ్యాణ్ రాజకీయ జీవితంపై హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు చేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మొదటి నుంచి సుమన్‌కు, చిరంజీవికి మధ్య మనస్పర్థలు ఉన్నాయని వార్తలు రావడం వింటూనే ఉన్నాం. అయితే సుమన్ కానీ, చిరు కానీ ఏరోజు తగాదాలు ఉన్నట్లు బిహేవ్ చేయలేదు. ఈ రూమర్స్ ను వారు ఎప్పుడు ఖండిస్తూనే వస్తున్నారు. ఇక తాజాగా ఒక కార్యక్రమంలో సుమన్.. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడుతూ సినిమా పరిశ్రమకు చెందిన వ్యక్తిగా చెబుతున్నాను. పవన్‌కు ఇప్పుడు మంచి క్రేజ్ ఉంది. ఎక్కడకు వెళ్లినా ఆయన అభిమానులు ఉన్నారు. ఇది పవన్ అదృష్టం. రాజకీయమైనా, వ్యాపారమైనా కూడా ఆ దేవుడు రాసి పెట్టి ఉంచాలి.. మనం అంతా కూడా యాక్టర్లమే. ఆ దేవుడు మనకు కొన్ని రోజులు పాట కొన్ని పనులు అప్పగిస్తాడు. మీరు చేసే పని నేను చేయలేను.. నేను చేసే పని మీరు చేయలేరు. జీవితంలో ఆయన సీఎం అవ్వాలని దేవుడు రాసిపెట్టి ఉంచాడు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ కంటిన్యూగా ఐదుసార్లు సీఎంగా ఉన్నారు.. కంటిన్యూగా 25 ఏళ్లు ఆయనే ఉన్నారు.. దేనికైనా ఒక ఎక్స్పైరీ టైం ఉంటుంది. ఆ టైమ్ వచ్చినప్పుడు వెళ్లిపోతోంది. సినిమాల విషయం వచ్చేసరికి ఆయనకు ఇప్పుడున్న ఫాలోయింగ్ ఇంక ఎవ్వరికీ లేదు.. ఆయనకు ఉంది.. కానీ, ఆయన ఎప్పుడు క్లిక్ అవుతారు.. ఆయనకు ఎప్పుడు ఆ స్థానం దక్కుతుంది.. ఆ సందర్భం ఎప్పుడు వస్తుంది.. క్యాస్ట్ ఈక్విషన్ సెట్ అవ్వాలి.. ఎప్పుడు చేయాలని జనాలు అనుకుంటారో.. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ బ్యాలెన్స్ అవుతుంది.. ఈ మనిషి వస్తే వాళ్లంత ధైర్యంగా ఉంటారని ఎప్పుడు అనుకుంటారో అప్పుడు ఆయన అవుతారు.. ఓ నటుడిగా ఆయనకు మంచి జరగాలని కోరుకుంటున్నాను.. ఆరోగ్యం మంచిగా చూసుకోవాలని కోరుకుంటున్నాను అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.

### అలా చేస్తే వైసీపీ పెద్ద తప్పు చేసినట్లే.. తన రాజీనామా ఆమోదంపై గంటా క్లారిటీ

విశాఖ, మార్చి 23 (న్యూస్): తన రాజీనామాను స్పీకర్ ఆమోదించారంటూ గత రాత్రి నుంచి జరుగుతున్న ప్రచారం పూర్తిగా వైకాపా మైండ్ గేమ్ మాత్రమేనని తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.ఈ విషయంపై తనకు ఎలాంటి అధికారిక సమాచారం లేదన్నారు. తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికే తన రాజీనామాను అమోదించారనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెదేపాలో ఓ ఎమ్మెల్యే ఓటు వేయలేకపోతున్నారనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఇలా చేస్తే.. వైకాపా అసంతృప్తులు వెనక్కు తగ్గుతారనేది ఆ పార్టీ ఆలోచన అని గంటా పేర్కొన్నారు.''రెండేళ్ల క్రితం రాజీనామా చేసి స్పీకర్ను వ్యక్తిగతంగా రెండుసార్లు కలిశా. నాటి నుంచి ఆమోదించకుండా ఉండిపోయిన రాజీనామాను గంటలో ఓటింగ్ అనగా ఆమోదిస్తారా? ఓటర్ లిస్టు వచ్చాక రాజీనామా ఆమోదించడం అనేది సాంకేతికంగా కుదరదు. అలా చేస్తే వైకాపా పెద్ద తప్పు చేసినట్లే అవుతుంది. పంచుమర్తి అనూరాధ నామినేషన్ పత్రాలపై ప్రపోజల్ సంతకం చేసింది నేనే. మా అభ్యర్థి అనురాధ గెలవబోతున్నారు'' అని గంటా శ్రీనివాసరావు వెల్లడించారు.

### ఇది దేవుడి స్క్రిప్ట్ జగన్ గారూ.. జగన్‌పై నారా లోకేశ్ సెటైర్లు

అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఒక స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటింది. తగినంత బలం లేకపోయినా పంచుమర్తి అనురాధను చంద్రబాబు ఎన్నికల బరిలోకి దించారు. ఆయన వ్యూహాలు ఫలించి అనురాధ 23 ఓట్లతో ఘన విజయం సాధించారు. ఈ విజయంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన విజయవాడ మాజీ మేయర్, చేనేత ఆడపడుచు, మా తెలుగుదేశం కుటుంబసభ్యురాలు పంచుమర్తి అనూరాధ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు అని చెప్పారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి జగన్‌పై సెటైర్లు వేశారు. 'మేము 23 సీట్లే గెలిచామని ఎద్దేవా చేశావు. అందులో నలుగురిని సంతలో పశువుల్లా కొన్నావు. చివరికి అదే 23వ తేదీన, అదే 23 ఓట్లతో నీ ఓటమి - మా గెలుపు. ఇది కదా దేవుడు స్క్రిప్ట్ అంటే జగన్ గారు' అని దెప్పిపొడిచారు.

### అమరవీరులకు అంజలి జనసేన అధినేత పవన్‌కల్యాణ్



అమరావతి, మార్చి 23 (హనం న్యూస్): దేశం కోసం ప్రాణాలర్పించిన అసలైన దేశభక్తులు సర్దార్ భగత్ సింగ్, షాహిద్ రాజగురు, షాహిద్ సుఖదేవ్ లని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. నేడు భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. దేశం కోసం చనిపోయేవారు ఎల్లకాలం బతికే ఉంటారు.. అంటారు శ్రీ భగత్ సింగ్. స్వర్గీయ భగత్ సింగ్, శివరాం రాజ్ గురు, సుఖదేవ్ థాపర్ విషయంలో ఈ పలుకులు అక్షర సత్యం అనిపిస్తాయి. మరణించి అమరులైనా నిరాకారంతో మన మధ్య జీవిస్తూనే ఉన్న వీరు చిరంజీవులు. సరిగ్గా ఇదే రోజున అంటే.. మార్చి 23, 1931న ఈ ముగ్గురు వీరులు దేశమాత దాస్యశృంఖలాలను తెంచడానికి లాహోర్ జైలులో ఉరి కంబాన్ని ముద్దాడారు. పట్టుమని పాతికేళ్ళు నిండకుండానే ఈ ముగ్గురూ దేశంలో రగిలించిన స్వతంత్ర కాంక్ష, విప్లవాగ్ని పరాయి పాలకులు దేశం నుంచి పారిపోయేంత వరకు జ్వలిస్తూనే ఉన్నాయి.ఈ పుణ్య తిథి నాడు ఆ అమరవీరులకు శిరస్సు వంచి అంజలి ఘటిస్తున్నాను. ఈ వీరుల బలిదానాలను స్మరించుకోడానికి ఏటా ఈ రోజున షహీద్ దివస్ (అమరుల సంస్మరణ) నిర్విహించుకుంటున్నాము. అయితే ఇది మాత్రమే సరిపోదని నా భావన. ఈ మహానీయులను నిత్యం స్మరించుకోవాలి. అందుకు తగిన విధంగా ఈ వీరుల విగ్రహాలను దేశవ్యాప్తంగా విరివిగా ఏర్పాటు చేయాలి. స్మారక స్థూపాలు నెలకొల్పాలి. వీరి చరితను చిరంతనంగా మన యువతకు అందించాలి. జాతిని నిత్యం

## అశ్లీల సందేశాలు.. పాక్ నుంచి ఆయుధాలు

(మొదటిపేజీ తరువాయి)

కోసం సంబం ధాలు పెట్టుకొంటున్నట్లు అతడు చెబుతున్న మాటలు ఉన్నాయి. ఈ మహిళల్లో కొందరు వివాహితలు కూడా ఉన్నట్లు గుర్తించారు. అతడి ఇన్‌స్టాగ్రామ్ సందేశాల్లో ఓ మహిళను వివాహేతర సంబంధం గురించి అడుగుతు న్నట్లు ఉంది. తాజాగా అమృత్‌పాల్ తన బైకును మరో వాహనంపై పెట్టి ప్రయాణిస్తున్న చిత్రాలను పోలీసులు గుర్తించారు. అతడి భార్య, తల్లిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

**పాకిస్థాన్ నుంచి ఆయుధాలు..**

అమృత్‌పాల్ పాకిస్థాన్ నుంచి ఆయుధాలు సేకరించే పనిలో ఉన్నాడని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఇంటెలిజెన్స్ అధికారి ఆంగ్లవార్తా సంస్థ 'ఎన్డీటీవీ'కి వెల్లడించారు. దీంతోపాటు పంజాబ్‌లో కల్లోలం సృష్టించాలనే ప్రణాళికతో అతడు పనిచేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. అమృత్‌పాల్ సింగ్ పాక్ ఐఎస్ఐ సాయంతో తెప్పించిన ఆయుధాలను డీఅడిక్షన్ సెంటర్లు, జల్‌పూర్ ఖేడా వద్ద కొన్ని ప్రార్థనా మందిరాల్లో భద్రపర్చినట్లు సమాచారం. దీంతోపాటు అక్రమ ఆయుధాల తరలింపు, తుపాకులను బహిరంగంగా ప్రదర్శించడం వంటి పనులు చేశాడు.

**సేకరించిన సొమ్ముకు లెక్కాపత్రం లేదు..**

'వారిస్ పంజాబ్ దే' సంస్థ ఆధ్వర్యంలో ఖల్సా వాహీర్ వంటి కార్యక్రమం నిర్వహించి సేకరించిన మొత్తానికి అమృత్‌పాల్ వద్ద ఎటువం టి లెక్కాపత్రం లేదు. ఖలిస్థాన్ పేరిట సేకరించిన సొమ్మును దుర్వి నియోగం చేస్తున్నాడని అధికారవర్గాలు చెప్పాయి. ఆ సొమ్ముతో ఖరీదైన వాహన కాన్వాయ్‌లో తిరిగినట్లు వెల్లడించారు.

ఇతర రాష్ట్రాల వారిపై అసహనం పెంచడం..

పంజాబ్ సమాజాన్ని మతం ఆధారంగా విడదీయడం అమృత్‌పాల్ అజెండాగా తెలుస్తోంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్ నుంచి పొట్టపోసుకొనే కూలీలపై స్థానికంగా వ్యతిరేకత పెంచేందుకు యత్నిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆనందర్పూర్ ఖల్సా ఫౌజీ సాయంతో ఇతర మతాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసి టెన్షన్లు పుట్టించాలన్నది అమృత్‌పాల్ ప్లాన్‌గా తెలుస్తోంది. దీంతోపాటు పంజాబ్ యువతలో తుపాకీ సంస్కృతిని పెంచేందుకు అమృత్పాల్ ప్రయత్నించాడు. దీనికి గురువుల బోధనలను వక్రీకరించేందుకు యత్నించాడు.

**మహారాష్ట్ర పోలీసులు అప్రమత్తం..**

అమృత్‌పాల్ వేట ఇప్పుడు మహారాష్ట్రకు కూడా విస్తరించింది. తాజాగా నాందేడ్ పోలీసులు అప్రమత్తమైన వాహనాల రాకపోకలపై దృష్టిపెట్టారు. దీంతోపాటు మహారాష్ట్ర ఏటీఎస్ పోలీసులు కూడా హైఅలర్ట్‌లో ఉన్నారు. ఇప్పటికే అమృత్‌పాల్‌కు సంబంధించిన ఏడు రకాల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు.

## ఆరుగురు గెలిచారు.. ఆయన మాత్రం ఓడారు

(మొదటిపేజీ తరువాయి)

గురువులు మినహా మిగతా ఆరుగురు విజయం సాధించారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలుగా మర్రి రాజశేఖర్, బొమ్మి ఇజ్రాయిల్, పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం, పెన్మత్స సూర్యనారాయణ రాజు, జయ మంగళ వెంకటరమణ విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థి అనురాధ విజయం సాధించడంతో.. వైసీపీ అభ్యర్థి కోలా గురువులు ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 175 ఓట్లకు గాను అన్ని ఓట్లు అంటే 175 ఓట్లు పోల్ అయ్యాయి. ఓట్ల లెక్కింపులో అన్ని ఓట్లు వాలిడ్ అయినట్టు ముందే అధికారులు ప్రకటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత అప్రమత్తమైన అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బరిలో ఉన్న ఒక్కో అభ్యర్థికి 21 మంది ఎమ్మెల్యేలను కేటాయించింది. ఇక, మంత్రులను, నేతలను ఇంఛార్జ్‌లుగా పెట్టి.. ఫాలో అప్ చేసింది.. మొత్తం ఏడు స్థానాలను గెలుచుకునే విధంగా స్కెచ్ వేశారు వైసీపీ అధినేత.. కానీ, సరైన సంఖ్యలో ఎమ్మెల్యేలు లేకపోయినా.. టీడీపీ మాత్రం ఓ స్థానాన్ని గెలుచుకోవడంతో.. తమ పార్టీ ఎమ్మెల్యేల వైపు అనుమానంగా చూడాల్సిన పరిస్థితి వైసీపీకి ఏర్పడింది.

## హైకోర్టు తరలింపు న్యాయస్థానాల పరిధిలోనే



(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 214 నిబంధన, 2018లో కేంద్రం వర్సెస్ దన్ గోపాల్ రావు, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టం 2014 ప్రకారం అమరావతిలో హైకోర్టు ఏర్పాటైందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఉమ్మడి హైకోర్టుగా ఉన్న అప్పటి హైదరాబాద్ హైకోర్టు, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ హైకోర్టు అమరావతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు ప్రతిపాదించారని గుర్తు చేశారు. సీఎం మూడు రాజధానుల ప్రతిపాదనకు వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయని పేర్కొన్నారు. హైకోర్టు తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి తెలిపారు. మరి కేంద్ర ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా రియాక్ట్ అవుతుందనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే. ఇప్పటికే పోలవరం ఎత్తుకు సంబంధించి కీలక ప్రకటన చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు హైకోర్టు తరలింపుపైనా తన అభిప్రాయాన్ని తెలిపింది.

## దేవాదాయ శాఖ చరిత్రలో శుభదినం

(మొదటిపేజీ తరువాయి)

అయితే, రెవెన్యూ, ఎండోమెంట్, ఫారెస్ట్ శాఖలతో సమీక్ష నిర్వహించాం.. మూడు శాఖలు సమన్వయంతో పనిచేసి సరిహద్దులు నిర్ణయం తీసుకున్నాం.. 4,430 ఎకరాల భూమికి బౌండరీ ఫిక్స్ చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని.. సరిహద్దులు నిర్ణయించే విషయమై స్కెచ్ రెడీ చేసి.. ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. శ్రీశైలం దేవస్థానం, దేవాదాయ శాఖ చరిత్రలో ఈరోజు నుంచి సువర్ణాధ్యాయం మొదలవుతోందని పేర్కొన్నారు మంత్రి కొట్టు సత్యనారాయణ. సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, అధికారులు ఎంతో సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు మంత్రి కొట్టు. ఇక, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. చాలా కాలంగా శ్రీశైలం దేవస్థానానికి చెందిన 5300 ఎకరాల అటవీశాఖ భూములతో ఇబ్బందులున్నాయి.. ఇప్పుడు దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎవరూ పరిష్కరించలేని సమస్యకు ఈ రోజు ఓ పరిష్కారం దొరికింది. మాఢవీధుల ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యిందన్నారు. దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సమస్య పరిష్కారానికి ఎంతో శ్రద్ధ తీసుకున్నారని.. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొట్టు సత్యనారాయణకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి షాక్

అమరావతి, మార్చి 23 (మనం న్యూస్): మొన్నటికి మొన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌లోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థికి ఓటమి తప్పలేదు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పంచమర్తి అనురాధ విజయం సాధించారు.. ఆమెకు 23 ఓట్లు వచ్చాయి.. అయితే, ఎమ్మెల్యే కోటాలోని ఏడు స్థానాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఏడుగురు అభ్యర్థులను బరిలోకి దింపగా.. టీడీపీ అధినేత చంద్రబాబు.. తమ అభ్యర్థిగా పంచుమర్తి అనురాధను ప్రకటించారు.. ఇక, ఈ ఎన్నికలపై ఆది నుంచి టెన్షన్ నెలకొంది.. ఏడు స్థానాలు మేమే కైవసం చేసుకుంటామని అధికార వైసీపీ నేతలు చెబుతూ రాగా.. ఆ ఒక్కటి మాదే.. అని టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు.. మొత్తంగా 23 ఓట్ల రావడంతో టీడీపీ అభ్యర్థి అనురాధ విక్టరీ కొట్టారు.

## కొందరు ఎమ్మెల్యేలు చంద్రబాబు ప్రలోభాలకు గురయ్యారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రలోభాలకు కొందరు గురయ్యారని, ఇక వారి రాజకీయ భవిష్యత్తును వారే చూసుకోవాల్సిందేనని చెప్పారు. చంద్రబాబుది ఎప్పుడూ వాడుకుని వదిలేసే మనస్తత్వమని అన్నారు. ఈ విజయాన్ని బలం అనుకుంటున్నారని, అది చంద్రబాబు పిచ్చితనమని చెప్పారు. క్రాస్ ఓటింగ్ చేసింది ఎవరనే విషయంలోకి ఇంకా వెళ్లలేదని... పార్టీ పెద్దలు ఈ విషయాన్ని చూసుకుంటారని అన్నారు. ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి ఇద్దరూ టీడీపీకి ఓటు వేసి ఉండొచ్చని చెప్పారు. ఏడుగురు వైసీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని టీడీపీ వాళ్లు అంటున్నారని... అయితే వాళ్ల ఎవరనే విషయాన్ని మాత్రం వాళ్ల చెప్పరని అన్నారు. టీడీపీ పోటీ పెట్టిన తర్వాత తమ ప్రయత్నాలను తాము చేశామని... అయితే, తెరవెనుక డబ్బు పని చేసి ఉంటుందని చెప్పారు. ఓటమిని అంగీకరిస్తున్నారా? అనే ప్రశ్నకు సమాధానంగా టీడీపీది విజయమని తాము భావించడం లేదని అన్నారు.

## మార్చి 24న ఎస్వీ ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవం

తిరుమల, మార్చి 23, మనం న్యూస్: శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవం మార్చి 24వ తేదీ శుక్రవారం జరగనుంది. పాఠశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. మద్రాస్ ఐఐటి డైరెక్టర్ ఆచార్య వి.కామకోటి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. ప్రత్యేక అతిథులుగా రేమాండ్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీ సంజీవ్ శరిన్, సింఘానియా విద్యాసంస్థల డైరెక్టర్ డా.రేవతి శ్రీనివాసన్ విచ్చేస్తారు. ఈ సందర్భంగా వసుధైవ కుటుంబం పేరిట నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తారు. టిటిడి ఉన్నతాధికారులు పాల్గొంటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## దేశంలో భగత్ సింగ్ ఆశయాలకు పాతరేస్తున్న మతతత్వ రాజకీయాలు

- సమసమాజ స్థాపనకోసం యువత ముందుకు రావాలి
- భగత్ సింగ్, రాజుగురు, సుకదేవ్ 92వ వర్ధంతిని జరుపుకున్న సీపీఐ నాయకులు



మదనపల్లి, మార్చి 23, మనం న్యూస్ ప్రతినిధి: భగత్ సింగ్, రాజుగురు, సుకదేవ్ 92వ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు సిపిఐ రాష్ట్ర నాయకులు టి కృష్ణప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. గురువారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతి పిన్న వయసులోనే తమ ప్రాణాలను త్యాగం చేసి యువతరానికి స్ఫూర్తిగా నిలిసిన గొప్ప విప్లవ పోరాట యోధులు సర్దార్ భగత్ సింగ్,రాజుగురు,సుకదేవ్ లని కొనియాడారు. నాడు బ్రిటీష్ వలసపాలనకు వ్యతిరేకంగా ఎంతోమంది విప్లవ కారులు ప్రాణ త్యాగాలు చేస్తే, నేటి పాలకవర్గం అమెరికా సామ్రాజ్య వాదానికి, కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానించి,దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు.స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిన మత ఛందస్సవాదులు నేడు దేశాన్ని పాలిస్తున్నారని, వారు స్వాతంత్ర్యో ద్యమ పోరాటస్ఫూర్తి ఎరుగరన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది విప్లవకారుల త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యం నేడు కుల,మత రాజకీయాల చుట్టూ తిప్పుతూ, మత విద్వేషాలు రెచ్చగొడుతూ మనుషుల మధ్య అంతరాయాలు సృష్టిస్తూ, మతరాజ్య స్థాపనకోసం, దేశంలో మత ఉన్మాద రాజకీయాలు చేపడుతున్నారన్నారు. సమసమాజ స్థాపన కోసం భగత్ సింగ్ లాంటి ఎంతోమంది విప్లవకారులు కలలు కంటే, నేడు అసమా నతలుతో కూడిన మతరాజ్యం స్థాపనకోసం మతఉన్మాధాన్ని రెచ్చగొడు తున్నారని విమర్శించారు. నేటి యువత,విద్యార్థులు ఈ దేశంలో ప్రజాస్వా మ్యాన్ని, లౌకిక వాదాన్ని కాపాడుకోవడం కోసం ముందుకు రావాలని, కుల, మత మౌఢ్యం ఉచ్చులో చిక్కుకోవద్దని, సమసమాజం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబ శివ, విశ్వనాథ్ నాయక్, నియోజక వర్గ కార్యదర్శి కె మురళి, రెడ్డెప్ప, దేవ, రవి, తిరుమల, సూరి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శోభ కృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలే..




తిరుపతి, మార్చి 23, మనం న్యూస్: శ్రీ శోభ కృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలే కలుగుతాయని తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రధాన అర్చకులు పంచాంగ శ్రవణ కర్త జోష్ల శ్రీ రామకృష్ణ శర్మ అన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను తిరుపతి ప్రెస్ క్లబ్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజ కార్యక్రమాల అనంతరం పంచాంగ ప్రవచనాన్ని నిర్వహించారు. రామకృష్ణ శర్మ మాట్లాడుతూ శ్రీ శోభ కృత్ నామ సంవత్సరంలో కొంతమంది రాజకీయ నాయకులు, నాయకత్వం వహించే కొంత మంది వ్యక్తులు ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఎడాదంతా వర్షాలు వృద్ధిగా ఉంటాయన్నారు. రెండు పంటలు పుష్కలంగా పండి రైతుల ఇళ్లల్లో ఆనందం నెలకొంటుంది అన్నారు. గత ఏడాది కంటే ఈసారి అన్ని రంగాలు అభివృద్ధి వైపు పరుగులు పెడతాయన్నారు. అనంతరం రాశుల వారీగా ఈ ఏడాది రాశి ఫలాలను ఆయన వివరించారు. పంచాంగ ప్రవచకర్త శ్రీ రామకృష్ణ శర్మతో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులు చిత్రపు రామకృష్ణ శేషగిరి రావు, చిగోరా ఆధ్యాత్మిక సంస్థ అధ్యక్షులు చిత్రపు హనుమంతరావు లను ప్రెస్ క్లబ్ కమిటీ తరపున ఘనంగా సత్కరించారు . ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ లావణ్య కుమార్, ఈసీ మెంబర్ మహేష్, పూర్వపు అధ్యక్షులు అక్షింతల నాగరాజు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మండే ఎండలతో జాగ్రత్తగా ఉండాలి



కురబలకోట, మార్చి 23, మనం న్యూస్ : ఈసారి ఎండలు గరిష్ట స్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుండే జాగ్రత్త వహించాలని తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్లో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చిలోనే ఎండలు మండుతున్నాయన్నారు. వడ దెబ్బ తగలకుండా ఉపాధిహామీ కూలీలు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు, రోగులు జాగ్రత్తగా మసలు కోవాలన్నారు. అంతకు ముందు ఎంపీపీ బి.దస్తగిరి మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా అగ్ని ప్రమాదాలు జరక్కుండా చూడాలన్నారు. సీజనల్ గా లభించే పుచ్చకాయలు,కర్బూజా కొబ్బరి బోండాం, తాటి ముంజలు, పండ్ల రసాల లాంటివి తీసుకోవాలన్నారు. వైద్యాధికారి కె. శ్రీధర్ మాట్లాడుతూ దాతల సహకారంతో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కూడా ఓఆర్ఎస్ ప్యాకే ట్లను అందుబాటులో ఉంచడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా నీరు ఎక్కువగా తాగాలన్నారు. ఎంపీడీఓ దిలీప్ కుమార్ మాట్లాడుతూ అడవుల్లో జంతువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎండలకు బయట తిరిగే వారు టోపీ, రూమాలు లాంటివి వాడాలన్నారు. పశువులు, గొర్రెలను చల్లని పొద్దులో మేతకు తోలుకెళ్ళాలన్నారు. వైస్ ఎంపీపీ భూదేవి తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ అంచనాలపై స్టాండింగ్ కమిటీ ఆమోదం

- మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ




తిరుపతి కార్పొరేషన్, మార్చి 23, మనం న్యూస్: తిరుపతి నగరపాలక సంస్థ 2023-2024 సంవత్సరమునకు సంబంధించి బడ్జెట్ అంచనాలు, అదేవిధంగా 2022-2023 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చించి, శనివారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టి కౌన్సిల్ ఆమోదంతో వెల్లడం జరుగుతుందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్ విషయాలపై గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటి ప్రత్యేక సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటి సభ్యులు పాల్గొని చర్చించడం జరిగింది. ఆదాయ వనరులను పెంచేలా చర్యలు తీసుకోవాలని, కాలి స్థలాల యజమానులను గుర్తించి ఆ స్థలాలకు పన్నులు విదించి కార్పొరేషన్ కు ఆదాయం పెంచేలా చూడాలని చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహచారి, గణేష్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మా, మేనేజర్ చిట్టిబాబు, సెక్రటరీ రాధిక,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగంలు పాల్గొని చర్చించడం జరిగింది.

### లక్ష్యాల మేరకు గ్రామాలలో నిర్దేశించుకున్న

## గడువు లోపు రీ సర్వే పక్రియను మరింత వేగవంతం చేయాలి

- గ్రౌండ్ ట్రూథింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- హద్దురాళ్ళు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి
- సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్



తిరుపతిటౌన్, మార్చి 23, మనం న్యూస్: : లక్ష్యాల మేరకు గ్రామాలలో నిర్దేశించుకున్న గడువులోగా రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేలా చూడాలని సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సి.సి.ఎల్.ఏ కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రీ సర్వే కార్యాచరణ, అమలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జె.సి. డి.కె.బాలాజీ, డి.ఆర్.ఓ. శ్రీనివాస రావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్ ఓఆర్, డ్రోన్ ఫ్లయింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. హద్దు రాళ్ళు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్రోన్ ఏరియల్ ఫ్లయింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. బౌండరీ కన్ఫర్మేషన్, ఏరియా వ్యాలీడేషన్, సర్వే పూర్తి, ఫైనల్ రెవిన్యూ రికార్డు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్ ఓఆర్, 13 నోటిఫికేషన్ తదితర ప్రక్రియలన్నీ కూడా పురోగతి కనిపించాలని సూచించారు. వీడియో కన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో మాట్లాడుతూ.. రీ సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1050 గ్రామాల్లో గాను 250 గ్రామాలలో డ్రోన్ ల ద్వారా రీ సర్వే ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాలలో కూడా పనులను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ కూడా గడువులోపు పూర్తయ్యేలా చూడాలని అన్నారు.

## ఎస్టీ సాధనే లక్ష్యంగా డిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం

- 4న డిల్లీ ఆంధ్ర భవన్ వేదికగా సమావేశం
- కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు



మదనపల్లి, మార్చి 23, మనం న్యూస్ ప్రతినిధి: దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలలో కురబలు ఎస్టీ జాబితాలో కొనసాగుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్లో బిసిలుగానే మిగిలిపోయారని కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జబ్బల శ్రీనివాసులు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కురబ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ ఏప్రిల్ నెల 4 వ తేది ఆంద్ర భవన్ నందు కురబ, కురుమల ఎస్టీ సాధనే ధ్యేయంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా కురబలు పలు రకాల పేర్లతో పిలువడం జరుగుతోందన్నారని,గొర్రె పెంపకం వృత్తిగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నారన్నారు . సామాజిక, రాజకీయ, విద్య, ఆర్థికంగా ఎంతో వెనుకబడిన కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా ఫలితం లేదని వాపోయారు. ఎస్టీ సాధన కోసం చేసే ఈ పోరాటంలో కురబ కులస్తులు కలసి రావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 4 వ తేది నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి మేధావులు, ఉద్యోగులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కురబ కుల పెద్దలు హజరు కావాలని కోరారు.

## పనపాకంలో సీసీ రోడ్ల పనులను పరిశీలించిన ఎంపీపీ



చంద్రగిరి, మార్చి 23, మనం న్యూస్: చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో స్థానిక శాసనసభ్యులు,ప్రభుత్వ విప్, తుడా చైర్మన్, డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో తుడ నిధులతో మంజూరు చేసిన సిసి రోడ్ల పనులను చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్ల పనులు ఎలా జరుగుతున్నాయి ప్రస్తుతం జరుగుతున్న పనులే కాకుండా మిగిలిన గ్రామాలలోను సిసి రోడ్లు మంజూరు చేస్తామని అన్నారు. గ్రామాభివృద్ధికి మన శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిధులను మంజూరు చేస్తున్నారని, గ్రామాల్లోని ప్రజలు సహకరించి మీ మీ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ గ్రామస్తులను కోరారు. గురువారం పనపాకం పంచాయతీ లో 30 లక్షల రూపాయలతో జాతీయ రహదారి నుంచి తూర్పుపల్లికి, జాతీయ రహదారి నుంచి తువ్వసేను వారిపల్లెకి, జాతీయ రహదారినుంచి అమావాస్య వారి పల్లికి సిసి రోడ్లను నిర్మిస్తు న్నారు. వీటి పనితీరును చంద్రగిరి ఎంపీపీ యం.హేమేంద్రకుమార్ రెడ్డి పరిశీలించి, గ్రామస్తులను, కాంట్రాక్టర్ను, అడిగి తెలుసుకు న్నారు. అమావాస్యవారి పల్లెలో మెయిన్ రోడ్ నుంచి గ్రామంలోకి 400 మీటర్లు ఉంటే 300 మీటర్లకు మాత్రమే సిసి రోడ్డు మంజూరు అయిందని, మిగిలిన 100 మీటర్లను సిసి రోడ్డు పనులు పూర్తి అయ్యే లోగా నిధులు మంజూరు చేయాలని ఎంపీపీని గ్రామస్థులు కోరారు. దీంతో ఎంపీపీ మంజూరు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఏ గ్రామంలోనైనా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలంటే మన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముందుంటారని ఎంపీపీ అన్నారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి దక్షిణ మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు అగరాల దేవా రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ ఔరంగాజేబ్, పార్టీ నాయకులు పానేటి చంగల్రాయులుయాదవ్, కసాగోపాల్,అమాస నాగేశ్వరరావు, దూర్వాసులు, అమాస భాస్కర్, కాంట్రాక్టర్ భాస్కర్ రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు ఆస్పత్రులను నిర్వహించాలి

- రిజిస్ట్రేషన్, రెన్యువల్ తప్పనిసరి
- అనధికార అస్పత్రులపై చర్యలు తప్పవు
- స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నేరం
- గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టవ్యతిరేఖ అధికారిని దేవశిరోమణి




మదనపల్లె, మార్చి 23, మనం న్యూస్ క్రైమ్: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేటు ఆస్పత్రులను నిర్వహించాలని గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టవ్యతిరేఖ జిల్లా అధికారిని దేవశిరోమణి పేర్కొన్నారు. గురువారం జిల్లా ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో మదనపల్లె పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు డాక్టర్లు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవశిరోమణి మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో ప్రస్తుతం 43 ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ ఉందన్నారు. వీటితో పాటు అనధికారికంగా చాలా ఆస్పత్రులు నడుస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రులను నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. దాడుల్లో పట్టుబడితే ఆస్పత్రిని సీజ్ చేసి, నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. చాలా మంది ఇంకా రెన్యువల్ చేసుకోలే దన్నారు. ఈనెల 31వ తేదీలోపు రెన్యువల్ చేసుకోకుంటే రిజిస్ట్రేషన్ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఆ తరువాత చేసుకున్న వారికి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇక నుంచి జనన, మరణ, ప్రసవాలు, సిజేరియన్లు, టీకాల వివరాలను హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో నమోదు చేయాలన్నారు. వైవివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేయాలని సూచించారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలు, అధిక ఫీజుల వసూళ్లు, ఇతర అంశాలను తెలుసుకునేందుకు సులువుగా ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించే ఆయా ఆస్పత్రులపై

శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మదనపల్లెలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్ని కేసులకు చికిత్స అందిస్తూ మరణాలకు కారకులౌతున్నారని మండిపడ్డారు. ఆస్పత్రుల్లో అన్ని వసతులు అందుబాటులో ఉండాల న్నారు. త్వరలో ప్రైవేటు ఆస్పత్రుల్లో దాడులు నిర్వహిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఆస్పత్రులతో పాటు 59 స్కానింగ్ కేంద్రాలకు ప్రభుత్వ అనుమతి ఉందన్నారు. ఈ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డబ్బుకు ఆశపడి గర్భస్థ శిశువులను కడుపులోనే హత్య చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే నిర్వాహకులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ప్రజలకు తెలిసేలా అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దీంతోపాటు స్కానింగ్ ధరల బోర్డులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల్లో నిర్దేశిత ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. కొన్ని కేంద్రాల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. తనిఖీల్లో పట్టుబడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు అనుసంధానంగా ఉన్న స్కానింగ్ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు. వినబడుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ ఉన్న వాటికి రెన్యువల్ చేసుకోకుండా నిర్వహిస్తున్నట్లు తెలిసిందన్నారు. కేంద్రాల నిర్వహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ తో పాటు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సేవలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను గుర్తు చేసేందుకు ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో దివాకర్, డాక్టర్లు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉంది

- సైంటిస్ట్
- విద్య ఒక ఆయుధం
- యమ్.ఇ.ఒ
- అందమైన భౌష్యత్‌కు విద్య పునాది
- జియం శ్రీనివాసులు





తిరుపతి, మార్చి 24, మనం న్యూస్: దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని (ఎన్ ఏ ఆర్ ఎల్ గాదంకి ) సైంటిస్ట్ డాక్టర్ దుర్గారావు అన్నారు. చంద్రగిలోవున్న శ్రీ చైతన్య స్కూలు వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సైంటిస్ట్ డాక్టర్ దుర్గారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని, ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోని సైంటిస్టులుగా ఎదగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి గెస్ట్ ఆఫ్ ఆనర్ గా విచ్చేసిన ఎంఈఓ లలితకుమారి మాట్లాడుతూ విద్య జీవితాన్ని మారుస్తుందని లక్ష్యసాధనలో విద్య ఆయుధంలా ఉపయోగపడుతుందని, ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. స్పెషల్ గెస్ట్ గా విచ్చేసిన జీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థి జీవితం అందమైనదని, అందమైన భవిష్యత్తుకు పునాది ఇక్కడి నుంచే ప్రారంభం అవుతుందన్నారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి - తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన వేంక టేశ్వర స్వామి సాంగ్, శివ సాంగ్ అమ్మవారి సాంగ్, ఆర్ ఆర్ ఆర్ భీమ్ సాంగ్, విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జమీల్ భాషా , డీన్ విజయ్ కుమార్ , ప్రైమరీ ఇన్చార్జ్ యాస్మిన్ , ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ రత్నగారు, ఏవో కిషోర్ కుమార్ , ఉపాధ్యాయబృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ ఎండీకి ది మోస్ట్ ప్రామిసింగ్ బిజినెస్ లీడర్స్ ఆఫ్ ఆసియా' అవార్డు




శ్రీసిటీ, మార్చి 23, మనం న్యూస్: ఎకనామిక్ టైమ్స్ కు చెందిన ఈటి ఎడ్జ్ సంస్థ నిర్వహించిన ది ఎకనామిక్ టైమ్స్ ఏషియన్ బిజినెస్ లీడర్స్ కాంక్లేవ్ 2022-2023 7వ ఎడిషన్ అవార్డ్స్ కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ప్రతిష్టాత్మక 'ది మోస్ట్ ప్రామిసింగ్ బిజినెస్ లీడర్స్ ఆఫ్ ఆసియా' అవార్డు లభించింది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. వ్యాపార విస్తరణలో దేశ విదేశాలలో పెను ప్రభావాన్ని చూపిన అసాధారణ నాయకత్వానికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఎకనామిక్ టైమ్స్ అవార్డు పట్ల డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 'గ్లోబల్ బిజినెస్ హబ్'గా శ్రీసిటీని స్థాపించడంలో తమ బృందం సమిష్టి కృషి, విశిష్ట ఆలోచనా విధానానికి గుర్తింపుగా దీనిని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన కార్పొరేట్ గమ్యస్థానాలలో ఒకటిగా, విదేశీ బహుళజాతి సంస్థల పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం గల భారతదేశంలోని 'తయారీకి పది అత్యుత్తమ ప్రాంతాలలో' ఒకటిగా నిలిచిన శ్రీసిటీ, 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారానికి నిజమైన చోదకశక్తిగా దేశ విదేశీ ప్రముఖ పరిశ్రమలకు పుట్టినిల్లుగా మారిందన్నారు. నేడు తనకు దక్కిన ఈ గౌరవాన్ని మా టీమ్ మొత్తానికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ ఎండీతో పాటు మనీష్ తివారీ (అమెజాన్), అభిషేక్ గంగూలీ (ప్యూమా), సందీప్ సాంగ్వాన్ (క్యాస్ట్రోల్ ఇండియా), వికాస్ ఆనంద్ (డిహెచ్ఎల్ సప్లై చైన్), ఎస్.కృష్ణన్ (టిఎన్ మెర్కంటైల్ బ్యాంక్), తపన్ సింఘేల్ (బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్), హిమాన్షు టాండన్ (పిఓసిఓ ఇండియా), సైమన్ జార్జ్ (కార్గిల్ ఇండియా), వివేక్ కుమార్ దేవాంగన్ (ఆర్ఈసి), శరద్ అగర్వాల్ (లంబోర్గిని ఇండియా), శ్రీకృష్ణ, రామకార్తికేయన్ (హెక్సావేర్ టెక్నాలజీస్) కూడా ఈ అవార్డులు అందుకున్న వారిలో వున్నారు.

## పంచాయతీ అభివృద్ధి ధ్యేయంగ పనిచేస్తా!

- సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి



రేణిగుంట, మార్చి 23, మనం న్యూస్ ప్రతినిధి: విప్ప మానపట్టాడా గ్రామ ఎంచాయతీ నందు కొత్త సంవత్సరాదిని పురస్కరించుకొని గ్రామపం చాయతీ అభివృద్ధి ధ్యేయంగా పంచాయతీ నందు గల వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన ఎస్సీ ఎస్టీ వర్గీయులకు గ్రామపంచాయతీ సర్పంచ్ వి లక్ష్మీపతి రెడ్డి సొసైటీ వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఇంటి పన్ను మరియు నీటి పన్ను సంబంధించి సంబంధించిన ధనమును గ్రామపంచాయతీకి కట్టి పంచాయతీ దగ్గర నుండి రసీదులు తీసి గ్రామపంచాయతీ నందు గల ఎస్సీ ఎస్టీ కుటుం బాలకు ఎస్సీ ఎస్టీ రాష్ట్ర స్థాయి అధ్యక్షులు అయినటువంటి తాళపాక దేవరాజులు మరియు దళిత నాయకురాలు అరుణాదేవి చేతుల మీదుగా గ్రామపంచాయతీ నందు ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు అందజేసారు తర్వాత తాళ్లపాక దేవరాజులు మాట్లాడుతూ దళితులకు వెన్నుముకలా ఉండి తమ పంచాయితీ అభివృద్ధి తన అభివృద్ధిగా భావించే సర్పంచ్ నీ. నేను ఎక్కడ చూడలేదని అభివృద్ధి అవకాశాలను ఉపయోగించుకుని దళితులు అభివృద్ధి చెందాలని అందరూ పంచాయతీ సర్పంచ్ కి కృతజ్ఞత తెలియజేయాలని ఎల్లవేళలా ఇదేవిధంగా సహాయ సహకారాలు అందించాలని కొరారు తర్వాత సర్పంచ్ మాట్లాడుతూ తన పంచాయతీ అభివృద్ధి తన అభివృద్ధి అని తన పంచాయతీలోని ప్రతి దళిత కుటుంబాలకు తన ఎల్లవేళలా వెన్నుండి సహాయ సహకారాలు అందిస్తానని ఈ విధంగా తన వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఇదివరకే పోయిన సంవత్సరం కూడా టాక్స్ చెల్లించాలని ఇక రాబోవు మూడు సంవత్సరాల కూడా ఇదే విధంగానే చెల్లిస్తానని వారికి అవసరం ఉన్న ప్రతి ఒక్క దానిని స్వయంగా నేను దగ్గరుండి వారికి సహాయం అందించడానికి ఎల్లవేళలా ముందు ఉంటానని సభాముఖంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వెనకబడిన తరగతులకు సంబంధించినటువంటి ఎస్సీ ఎస్టీ కుటుంబకులు గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి సాయి మురళీకృష్ణ గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

# క్షయను అంతం చేయవచ్చు

**- డాక్టర్. సువర్ణలక్ష్మీ**

**- నేడు అంతర్జాతీయ క్షమ వ్యాధి దినోత్సవం**



అనంతపురం. మార్చి 23 మనం న్యూస్ వాడుక భాషలో టీబీగా పిలిచే క్షయ వ్యాధితో ప్రతి యేటా దాదాపు 13 లక్షల మంది మరణిస్తున్నారు. అందులో 26శాతం మంది మన దేశానికి చెందినవారు కావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషానికి ముగ్గురు చొప్పున టీబీతో మరణిస్తున్నారు. అందులో మూడవ వంతు మంది భారతదేశంలోనే ఉన్నారు.ఈ క్షయవ్యాధి అనేది బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు, వెన్నుముక వంటి శరీర భాగాలపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి గాలి బిందువులు ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. టీబీ సోకిన వ్యక్తులు తుమ్మినా,దగ్గినా, ఉమ్మి వేసినా వారి నుండి టీబీ బ్యాక్టీరియా సుక్ష్మ క్రిములు గాలిద్వారా వ్యాప్తి చెందుతాయి.ఓ వ్యక్తి ఈ క్రిములను కలిగి ఉన్న చుక్కల కేంద్రాలను పీల్చినప్పుడే వ్యాధి ప్రబలడం జరుగుతుంది. ఈ వ్యాధి వంటగది పాత్రలను పంచుకోవడం ద్వారా, లేదా ఎవరినైనా ముద్దుపెట్టునప్పుడు లాలాజలంతో సంబంధం కలిగి ఉండదు.పోషకాహార లోపం, మధుమేహం, క్యాన్సర్ రోగులు, హెచ్ఐవి, పోగాకు వాడే వ్యక్తులు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు, ఈ క్షయ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. జైళ్లు, నిరాశ్రయులైన ఆశ్రమాలు, మానసిక ఆస్రపత్రుల్లో నివసించే లేదా పనిచేసే వ్యక్తులు సరైన వెలుతురు లేని కారణంగా కూడా వ్యాధికి గురవుతారు. దగ్గు (కఫంతో, రక్తంతో), ఆయాసం,ఛాతిలో నొప్పి, జ్వరంతోనున్న వారు ఎక్కువగా బరువుతగ్గటం, బలహీనత, ఆకలి తగ్గడం, వంటి లక్షణాలతో ఉంటారు. ఛాతి ఎక్స్ రే, కఫం పరీక్షలు చేసి ఈ వ్యాధి సోకిందా లేదా అన్నది నిర్ధారణ చేయవచ్చు. ఈ వ్యాధి పూర్తిగా నయం చేయదగినది,నివారించదగినదిమందులు సంక్రమణకు పూర్తిగా చికిత్స చేస్తాయి. వివిధ జీవనశైలి మార్పులకు సహాయపడుతాయి. సమయానికి మందులు తీసుకోవడం చికిత్స యొక్క పూర్తి కోర్సును పూర్తి చేయడం ఆరోగ్యకరమైన ఆహారం, ప్రోటీన్ విటమిన్-సి, ఈ కాల్షియం అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం విశ్రాంతి, తగినంత నిద్రపోవడం ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉండడం సానుకూలంగా ఉండడం, రోటి న్ చెకప్ షెడ్యూల్ చేసుకోవడం కూడా వ్యాధి నిర్వహణలో సహాయపడుతాయి క్షయ వ్యాధి రాకుండా జాగ్రత్తలు పాటించాలి. డాక్టర్. సువర్ణలక్ష్మి. క్షయ వ్యాధి సోకకుండా అనేక జాగ్రత్తలు పాటించాలని అనంతపురం కిమ్స్ సవీర హాస్పిటల్ పల్మోనాలజిస్ట్ డాక్టర్. సువర్ణలక్ష్మి సూచించారు. శుక్రవారం జరుగబోవు అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆమె క్షయ వ్యాధి గ్రస్తులకు అనేక సూచనలందజేశారు. దగ్గుతున్నప్పుడు నోటికి రుమాలు అడ్డుపెట్టు కోవాలన్నారు.బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదన్నారు.మంచి మాస్కులు ధరించి,క్రమం తప్పకుండా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. మద్యం, పోగాకు పదార్థాలు తీసుకోరాదన్నారు. వెంటిలేషన్ ఉన్న గదిలో ఉండాలన్నారు.వ్యాధి సోకిన మొదటి కొన్ని వారాల్లోనే వేగంగా విస్తరిస్తుందన్నారు. కావున ఆ సమయంలో రోగితో కలిసి ఉండడం, నిద్రించడం వంటివి చేయకూడదన్నారు. ప్రజల్లో ఉన్న అపనమ్మకాలు తొలగించాలన్నారు. టీబీ నయంకాని వ్యాధియని,టీబి వంశపారపర్యంగా వస్తుందని,అసురక్షితమైన లైంగిక పద్దతుల ద్వారా వ్యాపిస్తుందన్నది అపోహ మాత్రమే నని అన్నారు. ఊపిరితిత్తుల వైద్య నిపుణుల సలహా మేరకు క్రమం తప్పకుండా టీబీ మందులు వాడాలన్నారు. వివిధ జీవనశైలి మార్పులతో టీబీని పూర్తిగా నయం చేయవచ్చునన్నారు.

## పప్పు సెనగ కొనుగోలు ప్రారంభించిన మండల వ్యవసాయ అధికారిని నవత



కూడేరు, మార్చి 23 ( మనం న్యూస్) మండల పరిధిలోని పి నారాయణపురం గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారిని నవత పప్పు సెనగ కొనుగోలును ప్రారంభించారు. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పప్పు సెనగకు రూ.5335 మద్దతు ధర ప్రకటించినట్లు ఆమెతెలిపారు. మండలం వ్యాప్తంగారైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక రోజుకు రైతుకు 25 క్వింటాళ్ల కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ హనుమంత రెడ్డి, వీహెచ్ఎ ప్రమోద్, ఏ ఈ ఓ శైలజ, ఆర్ బి కే సిబ్బంది రైతులు వాలంటీర్లు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## షిర్డి సాయిబాబా దేవాలయంలో ఉగాది వేడుకలు



మడకశిర,మార్చి 23,మనం న్యూస్: డకశిర పట్టణంలో రెండవ షిర్డి గా వెలుగొందుతున్న శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయంలో గురువారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఉదయం వివిధ అభిషేకములు జరిపి,ప్రత్యేక అలంకరణ చేసి,మహా మంగళ హారతి,తీర్థ ప్రసాదం చేపట్టారు. నూతన సంవత్సర పంచాంగంను చెదివి వినిపించారు.13మంది దాతలు ముందుకొచ్చి భక్తులకు అన్నదానం చేపట్టారు.దాతల కుటుంబాలను బాబా అన్నివిధాలుగా కాపాడుతూ చల్లని దీవెనలు అందించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

## నేటి యువత భగత్ సింగ్ అడుగుజాడలలో నడవాలి



పెనుకొండ మార్చి 23 మనం న్యూస్ నేటి యువత భగత్ సింగ్ అడుగుజాడలలో నడవాలని ఎమ్మెల్సీ మంగమ్మ పేర్కొన్నారు. స్వతంత్ర పోరాట యోధుడు భగత్ సింగ్ వర్ధంతిని పెనుకొండ మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం లోని కళ్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ....భారత స్వాతంత్రోద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావంతమైన విప్లవకారుడు భగత్ సింగ్ అన్నారు. యువతకు ఎంతో ప్రేరణ అని భగత్ సింగ్ అడుగుజాడలలో నడవాలని, దేశం కోసం యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డిఎస్పి హుస్సేన్ పీరా మాట్లాడుతూ....25 సంవత్సరాల లోనే ఉరిశిక్ష పడుతుందని తెలిసిన భగత్ సింగ్ చేసిన సాహసం అసమాన్యమన్నారు ఇప్పటి యువత రాజకీయ నాయకులు భగత్ సింగ్ ని తూచా తప్పకుండా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువత దేశ సేవలో పాలు పంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిల్లి చాంద్ భాషా, రామకృష్ణ ,సుధాకర్ గుప్తా ,హరి ,శ్రీనివాసులు, సూర్యనారాయణ, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ శ్రీదేవి, సీనియర్ పాత్రికేయులు రవుఫ్, పుర ప్రముఖ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉగాది వేడుకలు



అమరాపురం,మార్చి 23,మనం న్యూస్: మండలకేంద్రమైన అమరాపురంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం శ్రీ శోభ కృత తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నార్వహించారు.ఈ సందర్భంగా అమరాపురం ప్రముఖ ఆగమ ప్రవీణులు నరసింహ బట్టర్ పంచాంగ శ్రావణం చేసారు.అదేవిదంగా పట్టణంలోని శ్రీ విద్యగణపతి,శ్రీ ఆంజనేయస్వామి,శ్రీ శనిమహాత్మ,శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయాలలో ప్రత్యేక పూజలను జరిపి మహా మంగళ హారతి,తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు.2023 కొత్త సంవత్సరాది పంచాంగంను చెదివి వినిపించినట్లు ప్రధాన అర్చకులు హరీష్ స్వామి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సోదరాసోదరి మణులు,పట్టణ వసూలు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



పెనుకొండ మార్చి 23 మనం న్యూస్ రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డి.ఎస్.పి హుస్సేన్ పీరా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో డి.ఎస్.పి హుస్సేన్ పీరా ముస్లిం మత పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ...ప్రశాంతంగా రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముస్లిం మత పెద్దలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ బాబు, జమీందారులు శ్రీనివాసులు, దాదా పీర్, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య పథకాలను ప్రజల దరికి చేర్చడంలో, మీడియా సేవలు ఎంతో గొప్పవి



బళ్ళారి, మార్చి 23, మనం ప్రతినిధి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న, వివిధ ఆరోగ్య పథకాలను ప్రజల దగ్గరికి చేర్చడంలో మీడియా ప్రధాన పాత్ర పోషిస్తుందని, జిల్లా ఆరోగ్యాధికారి ( డి హెచ్ ఓ ), డాక్టర్ జనార్దన్ పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలోని, సభాంగణంలో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల, పరిచయ సమావేశంలో, మొక్కకు నీళ్లు పోయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో ఉత్తమ ఆరోగ్య స్థాపన కోసం వివిధ ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. ఎందుకు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. వీటిని సరి అయిన సమయంలో ప్రజల దగ్గరికి చేర్చే బాధ్యత మాత్రం మీడియా సమస్తవంతంగా నిర్వహిస్తుందని అభివర్ణించారు. పథకాలు అమలులో ఉన్న ప్రచారం లేకపోతే ప్రజలకు తెలియదని దీనివల్ల పథకం నీళ్లు కారుతుందన్నారు. కానీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఈ సామాజిక బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకొని ప్రజలకు చేరుస్తోందన్నారు. అనంతరం డిస్టిక్ సర్జన్, డాక్టర్ బసరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం, ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్టు వీటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ సెక్షన్, చిన్నపిల్లల విభాగం, కంటి ఆపరేషన్లు, హార్ట్ ఆపరేషన్లు, నరాలకు సంబంధించిన వ్యాధులు ఇలా అన్ని రకాల సేవలను అందిస్తున్న కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించివేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు వాపోయారు. మీడియా తన వంతు ప్రచారం చేసిన కూడా పేద కుటుంబాలు ఈ పథకాలను వినియోగించుకోకపోతే నిరుపయోగంగా మారుతాయన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో, జిల్లా కుష్టు రోగ నిర్మూలనాధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, డాక్టర్ పూర్ణిమ కట్టిమని, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మరి ఎం బి, డాక్టర్ నందినిజిల్లా ఆరోగ్య శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, డాక్టర్ గురునాథ్ బి. చవ్వాన్, డాక్టర్ దాసప్ప, డాక్టర్ మయూరి లతోపాటు జిల్లా పంచాయతీ ఆరోగ్య శాఖ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధి కోసం పనిచేస్తాం

**విశ్వహిందూ పరిషత్ సభ్యులు**

చెన్నేకొత్తపల్లి మార్చి 23 మండలములోని న్యామద్దల గ్రామంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి మరియు విశ్వహిందూ పరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పండుగ పర్వదినం పురస్కరించుకొని న్యామద్దల గ్రామంలో ప్రజలకుకాషాయ జెండాలను వితరణ చేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ పూజకు నోచుకోని పురాతన ఆలయాలను అభివృద్ధి పరచి హిందూ దేవాలయాలను పరిరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక చేయూత నిచ్చిన సూరన్న



ధర్మవరం. మార్చి 23 మనం న్యూస్ ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గురువారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేసి పలు పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.బత్తలపల్లి మండలం మాల్యవంతంకు చెందిన గోనుగుంట్ల మధవయ్య అకస్మాత్తుగా మృతి చెందడం తో సూర్యనారాయణ అయన ఇంటికి వెళ్లి మాదవయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కొన్ని రోజుల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకొని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి కి చెందిన చల్లా చంద్రను బత్తలపల్లిలోని నివాసంలో పరామర్శించారు. కాగా బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు, వివిధ ఆనారోగ్య కారణాలతో మృతి చెందిన పలు కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు., ఆర్థిక భరోసా కల్పించారు.బత్తలపల్లి మండలం , పోట్లమర్రి గ్రామానికి చెందిన ఆదిమూర్తి, కాటమయ్య లు గుండెపోటుతో మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రు.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఆటో ప్రమాదంలో మరణించిన బత్తలపల్లి మండలం పోట్లమర్రికి చెందిన బత్తల మల్లేష్,ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన దాసరి ఈశ్వరయ్య, పట్టణంలోని శాంతినగర్ కు చెందిన హాజీఫీరా, 27 వ వార్డ్ కు చెందిన ఆటో డ్రైవర్ నరసింహులు కుటుంబ సభ్యులకు రు.25 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.అదేవిదంగా ప్రమాదంలో గాయపడి వైద్య చికిత్సలు పొందుతున్న రాజేంద్రనగర్ కు చెందిన ఫయాజ్ కుమార్తె షాహి భానుకురు.25 వేలు,ప్రమాదంలో మృతి చెందిన ముదిగుబ్బ మండలం నల్లాయకుంట పల్లి గ్రామానికి చెందిన గాలి నారాయణ స్వామి కుటుంబ సభ్యులకు రు.25 వేలు అందజేశారు. ఈ విదంగా ఆటో ప్రమాదంలో మరణించిన ఆరుగురు కుటుంబ సభ్యులకు, గాయపడిన వ్యక్తితో కలిపి మొత్తం ఏడుగురికి రు.25 వేల చొప్పున రు.1.75 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇదిలా ఉండగా పట్టణంలోని శాంతి నగర్ కు చెందిన నిరుపేద కుటుంబమైన తలారి లింగమ్మ తనకు సహకరించలేదని స్థానిక వైస్సార్సీపీ కౌన్సిలర్ జేసీబీ రమణ అభివృద్ధి పేరుతో ఆమె ఇంటి గోడను జేసీబీ తో కూల్చివేసి ఆమెను వీధిపాలు చేయడంతో గోనుగుంట్ల సూర్యనారాయణ ఆమె ఇంటికి వెళ్ళి రు.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ముదిగుబ్బ మండలం చెంచుగారిపల్లికి చెందిన ఎన్.రామ్మోహన్ రెడ్డి ఇల్లు అకాల వర్షాలకు కూలిపోయినందున ఆయనకు ధర్మవరం పట్టణం లోని తన సొంత కార్యాలయములో రు.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని ఎర్రగుంట కాలనీకి చెందిన తన అభిమాని నూర్ మహమ్మద్ పెళ్ళికి వెళ్లలేదని సూర్యనారాయణ అయన ఇంటికి వెళ్ళి నవ వధూవరులను ఆశీర్వదించి రు.10 వేలు పెళ్లికానుక అందచేసారు. ఈ విదంగా అయన రు.2,40 లక్షలు పలు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

## ధర్మవరంలో ఎగిరేది తెలుగుదేశం జెండానే



ధర్మవరం. మార్చి 23 మనం న్యూస్ రాబోవు ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గంలో గెలిచేది తెలుగు దేశమేనని స్థానిక టి.డి.పి. నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణ తెలుగుదేశం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో దేశం నాయకులు కేశగాళ్ళ శ్రీనివాసులు, చిట్రా రామమోహన్, గొట్లూరు అనిల్, గుద్దిటి అనిల్, పల్లపు రవీంద్ర, ఇర్షాద్, బాబావలి,కుళ్లాయప్ప, ఇజ్రాయిల్ తదితరులు మాట్లాడుతూ 2019 ఎన్నికల అనంతరం ధర్మవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని తన స్వప్రయోజనం కోసం వీడి పార్టీని బలహీన పరచాలని చూసింది ఎవరన్నది ప్రజలందరికి తెలుసునన్నారు. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో నియోజక వర్గంలో తెలుగుదేశంపార్టీని తిరిగి కార్యకర్తలే కాపాడుకున్నారన్నారు. ఇటీవల కొందరు బిజెపి నాయకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ పై లేనిపోని ఆరోపణలు చేయడం సహించరానిదని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంపై అవగాహన లేని వారితో మాట్లాడించడం వారి దిగజారుడుతనంకు నిదర్శనమన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో ధర్మవరంలో వై.సి.పి. పై పోరాటం చేస్తున్నది ఎవరన్నది నియోజకవర్గ ప్రజలందరికీ తెలిసిన విషయమేనన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవేంద్రను ఎందుకు గెలిపించలేకపోయారో బిజెపి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే దాన్ని ముందు పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తెలుగుదేశం పార్టీ నాయకులు చేతులు ముడుచుకు కూర్చొరన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో గత నాలుగేళ్లుగా ప్రజలకు అందుబాటులో వుంటూ, ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ, తెలుగుదేశం కేడర్ ను కాపాడుకుంటూ వస్తున్న పరిటాల శ్రీరామ్ ను అఖండ మెజార్టీతో ధర్మవరం నియోజకవర్గంలో గెలిపించు కుంటామన్నారు.పరిటాల కుటుంబానికి నియోజకవర్గంలోని కార్యకర్తలందరూ అండగా నిలుస్తారన్నారు.ఎటువంటి పరిస్థితుల్లోనూ మరొక అభ్యర్థిత్వాన్ని బలపరిచే ప్రసక్తే లేదన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు రద్దు చేయాలి



బళ్ళారి, మార్చి 23, మనం ప్రతినిధి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహానగర పాలికే,ఇతర విభాగాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలను రద్దు చేయాలంటూడైరెక్ట్ పద్ధతిలో నియామకాలు చేయాలంటూ, బళ్లారి సిటీ కార్పొరేషన్ లో డ్రైవర్లుగా క్లీనర్లుగా, లోడర్లుగా పనిచేస్తున్న, పౌర కార్మికులు జిల్లా అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉమేష్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఈ పద్ధతిలో 32,000 మంది ఉద్యోగులు సేవా సల్లిస్తున్నట్టు తెలిపారు. పౌర కార్మికుల ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న, రమణ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని వాపోయారు. కాంట్రాక్ట్ పద్ధతిలో దియామకాలు చేయడంతో పాటు వివిధ నిబంధనలు తమపై మోపడం వల్లతమ ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందన్నారు.గత సంవత్సరంలో తాము సమ్మెకు దిగినప్పుడు స్వయానా ముఖ్యమంత్రి, ఈ పద్ధతిని నిర్మూలన చేయడంతో పాటు డైరెక్టర్ రిక్రూట్మెంట్ ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు, 8 నెలలు గడిచిన ఆచరణకు నోచుకోలేదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి విడుదల

చేసిన నోటిఫికేషన్లు పౌర కార్మికులకు మాత్రమే న్యాయం జరిగేలా ఆదేశాలు జారీ చేయడం ఎంతవరకు సమంజసం అంటారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి తమ సంక్షేమం కోసం కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి డైరెక్ట్ రిక్రూట్మెంట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్ని సౌకర్యాలు తమకు కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్నాలో సంఘం పదాధికారులు, వీరేష్, బసప్ప, కాలే ప్రసాద్ శ్రీనివాసులు గురు రాజా నాగేంద్ర గోపాల్ రాగప్ప ఓబులేష్ శ్రీకాంత్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఆరు నెలల పాటు క్షయ రోగులకు ఉచితంగా పౌష్టికాహార ప్యాకెట్స్ పంపిణీ

**- ప్రభుత్వ హాస్పిటల్ ప్రధాన వైద్యాధికారి విజయ కుమారి**



బంగారుపాళ్యం, మార్చి 23, మనం న్యూస్: బంగారుపాళ్యం మండల కేంద్రంలోని, వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ హాస్పటల్ నందు టోటల్ అపోలో ఫౌండేషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది క్షయ రోగులకు ఆరు నెలలపాటు ఉచితంగా, పౌష్టికాహార ప్యాకెట్స్ ఆరు రకాల కూడిన, రాగులు,జొన్నలు, సజ్జలు, వంటనూనె, పాల పౌడర్,పాలు, వంటి దాదాపు 1,000 రూపాయలు విలువ గలిగిన వస్తువులు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ లోహిత్ చంగల్ రాయన్ చేతుల మీదుగా రోగులకు ఈ వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది డిపిఎమ్ఓ ముఖి, ఎస్ టి ఎస్, ఎస్టిఎల్ ఎస్, ప్రకాష్, శివకుమార్, కౌన్సిలర్ బాబు, సూపర్వైజర్ బృహస్పతి, ల్యాబ్ టెక్నీషియన్ భువన తదితరులు పాల్గొన్నారు

## తిరుపతి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే నిరసన



తిరుపతి, మార్చి 23, మనం న్యూస్ : పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తిరుపతి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మీడియాపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన రైల్వేలో జర్నలిస్టుల రాయితీ పాసులను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ తో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించాలన్నారు. 2023 సంవత్సరానికి అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్ట్ యూనియన్ లను భాగస్వామ్యం చేసి నూతన అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్ పాస్ లు తమిళనాడు తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు లలో ప్రయాణించే సదుపాయం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ కనక నరసారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే తిరుపతి జిల్లా కన్వీనర్ నరేంద్ర, కో కన్వీనర్ కోటేశ్వర బాబు, రాష్ట్ర సమితి సభ్యుడు చంద్ర బాబు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాలు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు టి జనార్ధన్, యమ్.నాగరాజు , వెంకయ్య, కిషోర్ , మనోజ్ ,దినేష్, యూనియన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సంస్కృతిక విశ్వవిద్యాలయంలో నేటినుంచి వాగ్గేయ వైభవం



తిరుపతి, మార్చి 23, మనం న్యూస్ : నేటినుంచి మూడు రోజులపాటు 24,25,26 తేదీలలో తిరుపతిలోని సంస్క ృతిక విశ్వవిద్యాలయంలో వాగ్గేయ వైభవం గా జరుగుననిలక్ష్మి అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ నిర్వాహకులు డా. ద్వారం లక్ష్మి, డా.నేమాన వెంకటరమణ శర్మ తెలిపారు.స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం విలేకరులతో సమావేశంలో వారు మాట్లాడుతూ, మార్చి 24, 25, 26 తేదీలలో తిరుపతి రాష్ట్రీయ సంస్క ృత విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు వాగ్గేయకార వైభవం కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఆఫ్ కల్చర్ న్యూఢిల్లీ, జాతీయ సంస్క ృత విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మొదటిరోజు జరిగే భరత్ శర్మ అష్టావధానం కార్యక్రమానికి తిరుపతి జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణా రెడ్డి, టీటీడీ జేఈవో సదా భార్గవి, వైస్ ఛాన్సలర్ డా.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వాయులీన విద్వాంసురాలు డా. చల్లా ప్రభావతి, రంగస్వామి కృష్ణన్, విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి లకు బిరుదులను ప్రదానం చేయనున్నారు. 25, 26 తారీఖుల్లో సంగీత, నృత్య, హరికథా ప్రదర్శనలు వుంటాయని తెలియజేశారు.

## హంపాపురంలో చలివేంద్రం ప్రారంభం



రాప్తాడు, మార్చి 23 మనం న్యూస్ : మండుతున్న ఎండలకు అనుగు ణంగా ప్రజల దాహార్తిని తీర్చడానికి హంపాపురం గ్రామ యువత హెల్పింగ్ హాండ్స్ ఆద్వర్యంలో జాతీయరహదారి మీద చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమన్ని ప్రారంభించడానికి రాప్తాడు మండల ఎస్.ఐ అంజినేయులు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.ఈయన చేతల మీదగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి ఎండాకాలంలో దాహం అధికంగా ఉంటుంది ప్రజల దాహర్తిని తీర్చడానికి మీరు చేపట్టే ఈ కార్యక్రమము మంచిదని కొనియాడారు.గ్రామ యువత అందరూ కలిసి కట్టుగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం హంపాపురం జయప్ప,సంతోష్, జయప్రకాష్, సాయికు మార్ రెడ్డి, ఎర్రిస్వామి, సోముశేఖర్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలు

**- జగన్ రెడ్డి ప్రభుత్వం పై వ్యక్తం అవుతున్న వ్యతిరేకత**

**-రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరం ప్రజల బలమైన కోరిక**

**-2024 సాధారణ ఎన్నికలలో ఘన విజయం సాధిద్దాం**

**-రాయదుర్గం లో టీడీపీ పాలనలో ఆగిపోయిన అభివృద్ధిని పూర్తి చేద్దాం**

**-పార్టీ శ్రేణులకు కాలవ పిలుపు**



రాయదుర్గం, మనం న్యూస్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి విజయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చెంప పెట్టులాంటిదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఉదయం కాలవ రాయదుర్గం టీడీపీ కార్యాలయంలో నియోజ కవర్గ నాయకులతో కలిసి విజయోత్సవ సంబ రాలు జరుపుకున్నారు. అనంతరం కార్యకర్తల నుద్దేశించి మాట్లాడారు జగన్ రెడ్డి ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న తీవ్రమైన వ్యతిరేకత, చంద్రబా బునాయుడి పాలన రాష్ట్రానికి అవస రమనే ప్రజల బలమైన కోరిక వల్లే పట్టభద్రుల ఎన్నిక ల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధిం చిందన్నారు. పశ్చిమ రాయలసీమ నియో జకవర్గ పరిధిలో ఉన్న 38 నియోజకవర్గాల్లో వైసీపీకున్న వ్యతిరేకత తాజా ఫలితంతో స్పష్టమైందన్నారు. జగన్ సొంత జిల్లా కడపలో కూడా వైసిపి ఘోరంగా ఓడిపోవడం టీడీపీకి శుభపరిణామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాక ముందే ఓట్ల నమోదు కార్యక్రమం నుండి ప్రచారం వరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయడం వల్లే విజయం సాధ్యమైందన్నారు. ఇదే ఉత్సాహంతో 2024 సాధారణ ఎన్నికల్లో రాయదుర్గంతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తకంకణబద్ధులు కావాలన్నారు. నిర్లక్ష్యం, అత్యుత్సాహం విడిచిపెట్టి రెట్టింపు కష్టంతో, ప్రతి కుటుంబాన్ని కలవడంతో పాటు మళ్ళీ ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడి పాలన అవస రాన్ని తెలియజెప్పాలని కోరారు. రాయ దుర్గంలో తెలుగుదేశం పాలనలో ప్రారంభించి, ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రజల మద్దతు పొందాలని పార్టీ నాయకులకు కాలవ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నిక విజయంలో భాగస్వాములైన పార్టీ కుటు ంబ సభ్యులకు ఈ సందర్భంగా కాలవ శ్రీనివా సులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నగల్లీ రాజు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు లాల్లేప్ప, కురుబ హనుమం తు, కురుబ గిరిమల్లప్ప, హనుమంత రెడ్డి, రాష్ట్ర మహిళ కార్యనిర్వాహక కార్యదర్శిసంపత్ కుమారి, క్లస్టర్ ఇంఛార్జ్, కాదలూరు మోహన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పోర్శాళ్ల పురు షోత్తం, జిల్లా వాణిజ్య అధ్యక్షుడు గాజుల వెంక టేశులు,నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు కడ్డిపూ డి మహబుబ్ బాషా, క్లస్టర్ ఇంఛార్జీలు ఇనా యత్, కాలవ సన్నన్న,కేపిదొడ్డినాగరాజు, ధాన వేంద్ర,ఆనందరాజు, పూజారి తిప్పయ్య, వేణు, కరెన్న, సోమలాపురంఎంపిటీసీ మొండి మల్లికా ర్జున,మురడి ఎంపిటిసి బోయ గంగాధరని యో జకవర్గ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# లాంకో యాజమాన్యం అమిత్ షా పేరు వాడితే సహించేది లేదు

**-అమిత్ షా కు ఈసీఎల్ కంపినీక8 ఎలాంటి సంబంధం లేదు**

**-రోడ్డుకు అడ్డంగా వేసిన కంచెను తొలగించాలి**

**-బిజెపి మీడియా కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్**



శ్రీకాళహస్తి , మార్చి 23, మనం న్యూస్ ప్రతినిధి :శ్రీకాళహస్తిరూరల్ మండలంలోని రాచ గున్నేరి వద్ద ఉన్న నాటి న ల్యాంకో, నేటి ఈసీఎల్ కంపెనీ వారు చేస్తున్న అక్రమాలకు కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేరు వినియోగిస్తున్నారని తప్పుడు వార్తలు ప్రచారం అవుతున్నాయని బిజెపి రాష్ట్ర మీడియా కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ అన్నారు.అందులో ఏమాత్రం వాస్తవం లేదాన్నారు. గురువారం ఆయన ఈసిఎల్ కంపెనీ వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై వేసిన కంచె తొలగించాలని కోరుతూ బిజెపి నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి ఈసీఎల్ కంపెనీకి ,కేంద్ర మంత్రి అమిత్ షా కి, బిజెపికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఈసీఐఎల్ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా ఆర్ అండ్ బి రోడ్డుపై కంచి వేయడం, చిందేపల్లి గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బంది కలిగించడం హేయమైన చర్య అన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకుల అండదండలతోనే ఈ సెల్ యాజమాన్యం ఆర్ అండ్ బి రోడ్డుపై కంచి వేసి చిందేపల్లి గ్రామస్తులకు ఇబ్బంది కలిగించడం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని అయినా తిప్పి కొట్టారు. గత ఆరు రోజుల నుండి ఈసీఐఎల్ కంపెనీ వద్ద అటు చిందేపల్లి వాసులు నిరసన తెలుపుతూ వున్నారని, ఇటు పోలీసులు పికెటింగ్ వేయడం బాధాకరమన్నారు. ఆర్ అండ్ బి రోడ్డుపై కంచె వేయడం అమానుషమని, ఇదే విషయమై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశామన్నారు. హైకోర్టులో ఇదే విషయమై కేసు నడుస్తుంది అన్నారు. తీర్పు ఈనెల 31వ తేదీ వస్తుందని చెప్పారు. ఆలోపే ఈసీఎల్ యాజమాన్యం ఇలాగా ఆర్ అండ్ బి రోడ్డుపై కంచి వేయడం చిందేపల్లి గ్రామస్తులకు రాకపోకలకు అంతరాయం కలిగించడం బాధాకరమన్నారు. ఇకనైనా ఆర్ అండ్ బి రోడ్డుపై ఈసీఎల్ కంపెనీ వేసిన కంచెను తొలగించి చిందేపల్లి గ్రామస్తులకు రాకపోకలు యథావిధిగా కొనసాగేలా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి నాయకులు మేళాగరం సుబ్రహ్మణ్యం రెడ్డి,ప్రసాద్, బాలగుర వయ్య,కోనేటి అయ్యప్ప తదితరులు ఉన్నారు.

# మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



మదనపల్లి, మార్చి 23, మనం న్యూస్ ప్రతినిధి : జనసేన పార్టీ దక్షిణ రాయల కోస్తా పార్లమెంటరీ సమన్వయ కర్త డా.మైఫోర్స్ మహేష్ పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం పట్టణంలో ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు నందు ఆయన అభిమానులు, మైఫోర్స్ టీం సభ్యులు, జనసేన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకు న్నారు. అనంతరం చిత్తూరు బస్టాండు సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. మైఫోర్స్ మహేష్ మొదటి నుండి ఎన్నో సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆయన మైఫోర్స్ సంస్థను స్థాపించి తద్వారా పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు చెడు మార్గంలో నడవకుండా క్రీడలపై ఆసక్తి కనబరిచే దిశలో భాగంగా మైపోర్స్ ప్రిమియర్ లీగ్ ద్వారా క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించి విజేతలకు తమ సంస్థ ద్వారా పెద్ద మొత్తంలో నగదు బహుమతులు అందించే వారు. ఇలా పలుకార్యక్రమాలలో తనదైన శైలిలో చొరవ చూపి అందరివాడులా పేరు తెచ్చుకు న్నారు.ఇక రాజకీయాల విషయానికొస్తే జనసేన పార్టీలో క్రియాశీలంగా ఉంటూ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టిని సైతం ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన జనసేన పార్టీ దక్షిణ రాయల కోస్తా పార్లమెంటరీ సమన్వయ కర్తగా తన విధులను నిర్వహిస్తున్నారు. మదనపల్లె జిల్లా కోసం నిర్వహించిన ఉద్యమంలో చురుకుగా పాల్గొన డంతో పాటూ, జిల్లా పునర్విభజన దశలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి జనగణమన జిల్లా గా నామకరణం చేయాలని అభిలషించారు. అదేవిధంగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మదనపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడానికి జనం కోసం – జనసేన పాదయాత్ర నిర్వహించి పలువురి దృష్టిని ఆకర్షించారు. మైఫోర్స్ మహేష్ చిరకాలం తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ అనుకున్న లక్ష్యాలను సాధించడంతోపాటు రాజకీ యాల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ మా ట్లాడుతూ తన పైన ఇంతలా అభిమానాన్ని చూపిస్తున్న తమ శ్రేయోభిలాషులకు, ఆత్మీయు లకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారిని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తన చిరకాలవాంఛఅని తెలియ జేశారు. ఆయన అభిమా నులు, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మనుషులలో ఇంకా మనవత్వం మిగిలే ఉందినిదర్శనం ఫరీద్ బాబాకళాకారులను సత్కరిస్తున్న ఫరీద్ బాబా





రేణిగుంట మార్చ్23, 2023మనం ప్రతినిధి ఉగాది పురస్కారం మహోత్సవ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన విశిష్ట కళాకారుల కళా నైపుణ్యం కలిగిన వ్యక్తులకు మంగళవారం రేణిగుంట పట్టణం నందు జబ్బార్ ట్రస్ట్ అధినేత విశిష్ట సేవ, కళా భూషణ్, కళాబంధు, కళామిత్ర, యోధులు షేక్ ఫరీద్ బాబా అధ్వర్యంలో పలువురు కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన కళాకారులందరికీ శాలువతో ఘనంగా సత్కరించి జబ్బార్ ట్రస్ట్ మోమెంటు షీల్ లను బహుకరించి మహిళా కళాకారులను ఘనంగా సత్కరించి చీరలను ప్రధానం చేశారు ఈ సందర్భంగా షేక్ ఫరీద్ బాబా మాట్లాడుతూ ఉగాది పండుగ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం చాలా ఆనందంగా ఉందని ముఖ్యంగా మన సాంస్క ృతిక సమాజంలో కళాకారులు అనేవారు గొప్ప ప్రఖ్యాతి చెందిన వారిని నా చిన్నప్పటి నుంచి పలు కార్యక్రమంలో కళాకారులు చేసి ముత్యాలు గాని పద్యాలు గానీ చూడడం చాలా ప్రత్యేకంగా ముందుంటానని అలాంటి కళాకారులకు నా వంతు సహాయం గా సత్కరించి వారి మన్నెల పొందడం రానున్న రోజుల్లో కళాకారులని ఇంకా గొప్పగా సత్కరించి అందరూ కూడా కళాకారుల పట్ల మంచి భావాన్ని చూపించి వారికి వేతనం లేనివలన వారిని మనమే గుర్తించి పలు సేవా కార్యక్రమాలను అందరి ముందుకు వచ్చి స్వచ్ఛందంగా నిర్వహించాలని జబ్బార్ ట్రస్ట్ అధినేత ఫరీద్ బాబా తెలిపారు.

## ఏపీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి ఘనవిజయం...

**-పంచుమర్తి అనురాధ**



చంద్రగిరి, మార్చి 23, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ ఘనవిజయం సాధించడంతో గురువారం 7 గంటలకు తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పులివర్తి నాని ఆదేశాల మేరకు మండల పార్టీ మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ కూడలికి టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, చేరుకొని, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ 23 ఓట్లు గెలుపొందడం జరిగింది. టిడిపి నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి... నారా లోకేష్ వర్ధిల్లాలి... పులివర్తి నాని వర్ధిల్లాలంటూ హర్షధ్వానులు తో పలుకుతూ ఆనందవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్లి నేని సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ రానున్న 2024సంసార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ లో విజయఢంకా మోగుతుందని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతాడని జ్యోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌస్ బాషా, కన్నయ్య నాయుడు, నాగరాజు నాయుడు, ప్రవీణ్ రాయల్, డిష్ గోపి, అమ్ములు, రాజులు గారి వినోద్ కుమార్ రెడ్డి, గ్యాస్ నాగరాజు, టైలర్ శంకర, విసిరిపాటి శంకర్, కాపు వీధి తులసి, తదితరులు పాల్గొన్నారు.

## టి.డి.పీ ఎమ్మెల్సీ అభ్యర్తి అనురాధ గెలుపై నేతలు ర్యాలీ...



రామకుప్పం, మార్చి 23, మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యులు ఓటింగ్ తో గెలుపొందిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పంచమూరి అనురాద గెలుపుపై గురువారం రామకుప్పం టి. డి. పీ నేతలు బాణసంచాపెల్చి ర్యాలీ నిర్వహించారు గురువారం ఎమ్మెల్యేలు ఓటింగ్ తో ఎమ్మెల్సీ గా గెలుపొందిన తెలుగుదేశం అభ్యర్థి పంచామూరి అనురాధ 23 ఓట్ల ఆదిఖ్యతతో గెలుపొందడంతో తెలుగు దేశం పార్టీలో నూతన ఉత్తేజం రేకెత్తించింది గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీలు గెలుపొందడంతో తెలుగుదేశం కార్యకర్తల్లో నాయకుల్లో ఉత్తేజం పెరిగి గ్రామస్థాయిలో పార్టీపై బలం పెరిగిందని బాణసంచాపేల్చి సంబరాలు జరుపుకుంటున్నారాని మండలనాయకులు ఈ కార్యక్రమంలో మండల టి. డి. పీ అధ్యక్షుడు ఏ. ఆనందరెడ్డి మాజీ అధ్యక్షుడు సి. ఆంజనేయరెడ్డి రాష్ట్రఎస్సీ సెల్ అధ్యక్షుడు మునస్వామి నేతలు రామకృష్ణప్ప నరసింహులు గంట్లగౌడు, టి. వి. రవి, శ్రీనివాసులు ఆదిల్ బి. ఎస్ సలాం బాలు గంట్లరెడ్డి చాన్ విజయ్ జయశంకర్ శ్రీరాములు రెడ్డి నాగభూషణం మనోహర్ చంద్ర సుబ్రహ్మణ్యం రామలింగారెడ్డి నారాయణ మంజునాథ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శోభ కృత నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా

**గ్రామ దేవతలకు బోనాల మొక్కుబడి..**



కూడేరు మార్చి 23 ( మనం న్యూస్) మండల కేంద్రం సమీపంలోని అరవకూరు గ్రామం నందు ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామ దేవుళ్ళు అయినా పోతులయ్య స్వామి, పెద్దమ్మ, కుంటమ్మా, మారెమ్మ, సుంకలమ్మ ,ముత్యాలమ్మ గ్రామ దేవతలైన అమ్మవారికి ప్రతి ఏటా ఉగాది పండుగ సందర్భంగా ఆ గ్రామమునందు గ్రామ దేవతలకు ముక్కబడిగా బోనాల వెళ్లడం ఆనవాయితీగా జరుపుకొనుచున్నారు, ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామదేవతలైన అమ్మవారు చల్లగా మా గ్రామ ప్రజలను ఆయురారోగ్యాలను ప్రసాదించాలని పాడిపంటలతో గ్రామమందు సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామంలో కులమతాలు అతీతంగా బోనాలు అమ్మవారికి సమర్పించడం జరుగుతుందని ఇప్పటివరకు గ్రామంలో గ్రామ దేవతలు చల్లని చూపుతో అన్ని రకాలుగా మా గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఉంటున్నారని గ్రామ ప్రజలు తెలియజేశారు. గ్రామదేవతలకు ఆగ పూజ సమర్పించి వివిధ పుష్పాలతో అలంకరించి నైవేద్యం సమర్పించడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ మంద రామాంజనేయులు, కూడేరు మండల వైస్ ఎంపీపీ దేవా, మాజీ సర్పంచ్ కురుగుంట ప్రసాద్, శ్రీరాములు, పుట్టా నరేష్, కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, అంజి, ప్రసాద్, సంగన్న, ఓబులేసు, గ్రామ పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున గ్రామం పురవీధుల నుండి బోనాలు గ్రామ దేవతలకు అమ్మవారికి సమర్పించడం జరిగినది..

## అన్ని వర్గాలు సంక్షేమమే సీఎం లక్ష్యం

**- పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్**

**- సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం**



మంథని,మార్చి 23 మనం న్యూస్ : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఐకేపీ ఉద్యోగులకు జీఓ నంబర్ 11 ద్వారా పూ స్కేల్ అమలు చేస్తూ జీఓ ఇచ్చిన సందర్భంగా గురువారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఐకెపి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు అనేక విధాలుగా మేలు జరుగుతోందని అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు ఇచ్చిరని ప్రభుత్వ ఉద్యోగులు గౌరవంగా బతుకాలన్న సంకల్పంతో అనేక జీఓలను అమలు చే శారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనేక ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించే ఐకెపి ఉద్యోగులకు పెస్కెల్ అమలు చేయడం సీఎం కేసీఆర్ గొప్పతనానికి నిదర్శనమన్నారు. అనంతరం ఐకేపీ ఉద్యోగులు జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్‌ను శాలువాతో సన్మానించి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సందర్బంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్,జడ్పిటిసి తగరం సుమలత - శంకర్ లాల్,ఐకెపి మండల అధికారి సంతోషం పద్మ,ఐకెపి ఉద్యోగులు తిరుపతి,రాంబాయి, బిఆర్ఎస్ మండల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం జన చైతన్య యాత్ర బుక్లెట్స్ ఆవిష్కరించిన జడ్పీ చైర్మన్

**- బిజెపి ప్రభుత్వం కార్మికుల జీవితాలను రోడ్డుపాలు చేస్తుంది**

**- పెద్దపల్లి జిల్లా జడ్పి చైర్మన్ పుట్టమధుకర్**



మంథని,మార్చి 23 మనం న్యూస్ : సిపిఎం జనచైతన్య యాత్ర యొక్క బుక్లెట్స్‌ను పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక,నిరుపేద ప్రజలపై దాడి మొదలు పెట్టిందని ఒక ప్రక్క నిత్య అవసరాల వస్తువుల ధరలు పెట్రోలు,డీజిల్,గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతుంటే మరో ప్రక్క రైతులపై రైతు వ్యతిరేక చట్టాలు,విద్యుత్ వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి రైతుల మెడపై ఉరితాడు పెడుతుందని విమర్శించారు. విద్యారంగాన్ని కాషాయికరణ చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు విద్యారంగాన్ని అప్పజెప్పుతున్నారని అన్నారు.దేశంలో ఉన్న బొగ్గు,స్టీలు,రైలు,విమాన ఎల్ఐసి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ద్వారా దత్తం చేస్తూ కార్మికుల జీవితాలను రోడ్డుపాలు చేస్తుందని ఈ సంద ర్భంగా ఆయన పేర్కొన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో దళితులు, గిరిజనులు,ముస్లిం,క్రిస్టియన్,మైనార్టీలు మీద దాడులు పెరిగాయన్నారు. బిజెపి నిరంకుశ పాలను నిరసిస్తూ కొనసాగే జన చైతన్య యాత్ర జయప్రదం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ,ఎంపీపీ కొండ శంకర్,జడ్పీటిసి తగరం సుమలత,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుమారస్వామి, మహేశ్వరి,జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్,తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



నడిగుడెం మార్చి 23 మనం న్యూస్: పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా గురువారం నడిగుడెం మండల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు పోలీస్ సిబ్బంది కవాతును, యునిఫామ్, కిట్లు సామాగ్రిని తనిఖీ చేసి అనంతరం స్టేషన్‌లో రికార్డులు, కేసుల స్థితిగతులు, స్టేషన్



భౌగోళిక స్థితి గతులు మొదలగు అంశాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై ఏడుకొండలు, ప్రసాద్, అప్పరావు, బాస్కర్, వీరబాబు, సక్క తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూర్ ఎస్ పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా గురువారం ఆత్మకూర్ ఎస్ మండల పోలీస్ స్టేషన్ ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్టేషన్‌లో కేసుల నమోదు, రికార్డుల పరిశీలన, తదితర సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



సోమందేపల్లి మార్చి 23 మనం న్యూస్సో మందపల్లి మండల కేంద్రంలో వెలసిన తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి అమ్మవారి ప్రత్యేక పూజలు గురువారం నాడు ఆలయ ధర్మకర్త డిసిశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు నేడు జరగబోవు పంచమ జ్యోతుల మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు అలాగే అమ్మవారి జ్యోతుల మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసే భక్తాదులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని తెలియజేశారు ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరిగేలా ఎస్సై విజయ్ కుమార్ చర్యలు చేపట్టారు ఈ కార్యక్రమంలో డిసి వెంకటేష్ డి సి నారాయణస్వామి జడ్పిటిసి డిసి అశోక్ తొగటవీర క్షత్రియులుపాల్గొన్నారు

# చౌడేశ్వరి దేవి,శ్రీకృష్ణుడిని దర్శించుకున్న రామచంద్ర యాదవ్



మదనపల్లి, మార్చి 23, మనం న్యూస్ ప్రతినిధి: మదనపల్లె పట్టణంలోని చౌడేశ్వరి దేవి అమ్మవారిని, అనపగుట్ట లో వెలసిన శ్రీకృష్ణుడు ని ప్రముఖ పారిశ్రామిక వేత్త బోడే రామచంద్ర యాదవ్ దర్శించుకున్నారు. చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీకృష్ణ దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు బుధవారం రాత్రి ఆయన మదనపల్లి కి విచ్చేసారు. తొలుత పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీ హై స్కూల్ వద్ద పాలరమేష్ యాదవ్ ,ఉత్తన్నల ఆధ్వర్యంలో రామచంద్ర యాదవ్ అభిమానులు, యువసేన సభ్యులు రామచంద్ర యాదవ్ కు పూల తో ఘన స్వాగతం పలికారు..అక్కడి నుండి గోళ్ళ పల్లి క్రాస్ ,రామారావు కాలనీ,మీదుగా చౌడేశ్వరి దేవి ఆలయం వద్దకు వెళ్లారు.. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఆలయం నందు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు..అనంతరం ఆయన కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.. ఆలయ కమిటీ సభ్యులచే సన్మానించారు.. అక్కడి నుండి అనపగుట్ట లోని శ్రీకృష్ణ దేవాలయం నందు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని శ్రీకృష్ణుడు ని దర్శించుకున్నారు.. దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.. శ్రీకృష్ణ దేవాలయానికి రామచంద్ర యాదవ్ అందించిన ఆర్థిక సహకారం ఎప్పటికి మరవదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు..రామచంద్ర యాదవ్



మాట్లాడుతూ ప్రజలందరికీ శోబ్ కృత ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ పర్వదినాన చౌడేశ్వరి దేవి, శ్రీకృష్ణుడు ని దర్శించుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు.. ఈ ఉగాది తో ప్రజలకు అష్ట ఐశ్వర్యా లు కలగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాలరమేష్ యాదవ్, ఉత్తన్న,ఒర్సు వీర భాస్కర్, వంశీబొగ్గు భాస్కర్, రాజు , శ్యాము,ఆనంద్,హరి లతో పాటు రామచంద్ర యువసేన సభ్యులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు..

# పోరాటాలకు సిద్ధం కావాలి

ధర్మవరం. మార్చి 23 మనం న్యూస్ భగత్ సింగ్,రాజ్ గుర్, సుఖ్ దేవ్ ల స్ఫూర్తితో విద్యార్థి,యువజన లోకం పోరాటాలకు సిద్ధం కావాలని స్థానిక ఏ ఐ ఎస్ ఎఫ్, ఏ ఐ వై ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్,రాజ్ గుర్,సుఖ్ దేవ్ ల 92వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏ. ఐ. ఎస్. ఎఫ్, ఏ.ఐ.వై.ఎఫ్. ల ఆధ్వర్యంలో కార్యక ర్తలు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజా, ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పోతలయ్య లు మాట్లాడుతూ బాంబులు,తుపాకులు విప్లవాన్ని సృష్టించలేవన్నారు.విప్లవం అనే కత్తిని మీ ఆలోచన తో పెట్టాలన్నారు.భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల స్ఫూర్తితో అంతరాలు, అస మానతలు లేని సమాజాన్ని సృష్టించాలన్నారు. సంపదలో వాట, సమగ్ర యువజన అభివృద్ధి ,నూతన ప్రత్యామ్నాయ రాజకీయ విలువల కోసం పోరాడుదామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో ఏ ఐ ఎస్ ఎఫ్ కళాశాల కమిటీ నాయకులు గణేష్, తరుణ్, వంశీ, కిషోర్, మురళి, ధర్మతేజ, చైతన్య, విజయ్, రవి, కృష్ణ, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఉగాది వేడుకలలో..కవి సమ్మేళనం

తొర్రూరు టౌన్, మార్చి 23 (మనం న్యూస్ ) : డివిజన్ కేంద్రంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు, సారంగేశ్వర స్వామి ఆలయంలో మురళీ కృష్ణ మందిరంలో పంచాంగ పఠనం,శ్రవణం నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం,వాసవి మాత ఆలయం లో అర్చకులు ఓలేటి యాదగిరి చార్యులు గీతాచార్యులు ఆరుట్ల శ్రీకాంతా చార్యులు రేణిగుంట్ల శివ ప్రసాద్ పంచాంగ పఠనం కావించి విశిష్టతను తెలుపుతూ తిధి వార నక్షత్ర యోగ కరణం వీటిని కలిపి పంచాంగం అంటారు. ఒక్కొక్క అంశం ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించు కుందని, హిందూ సాంప్రదాయ ప్రకారం వీటిని హిందువులు ఆచరిస్తారని చెప్పారు.మంచి చెడు కార్యక్రమాలను ఆచరించడానికి ఇవి ఉపయోగపడతాయి అని,ఏ రోజుకు ఆ రోజు ఆ రోజు యొక్క ప్రాముఖ్యం తెలుసుకొని ఆచరించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. తెలుగు సంవత్సరాలు 60 ఉంటాయని అందులో ప్రభవ నామ సంవత్సరం తో ప్రారంభం అవుతుందని, చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ప్రారంభం అయినందున యుగాది, ఉగాది అంటారని అన్నారు. వాసవి మాత ఆలయం వద్ద మండల పట్టణ ఆర్యవైశ్య



సంఘం వాసవి క్లబ్, వాసవి వనితా క్లబ్ ల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, ప్రసాద వితరణ చేసారు. మున్సిపల్ చైర్మన్ మంగళం పల్లి రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా నాయకులు ప్రొద్దుటూరు గౌరీ శంకర్, జిల్లా నాయకులు సామరామూర్తి, బిజ్జాల వెంకటరమణ ఇమ్మడి రాంబాబు వల్లపు మధుమండల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మచ్చ సోమయ్య బిజ్జాల అనిల్ అధ్యక్షులు వాసవి క్లబ్, అధ్యక్షులు వజినపల్లి అనిల్ వనితా క్లబ్ అధ్యక్షురాలు వజినపల్లి దీప ప్రతినిధులు చిదరాల నవీన్, చిదర మహేష్ తమ్మి రమేష్, చకిలేల మణిరాజ్,నీలిమ గీత పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కవి సమ్మేళనం**

స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పర్వదిన వేడుకలు సందర్భంగా బుధవారం సాయంత్రం పంచాంగ పఠనం లో ఆలయ అర్చకులు మంత్రోచ్చారాణ ల మధ్య నిర్వహించిన అనంతరం ఆలయ నిర్వాహకులు డాక్టర్ కుందుర్ రాజేందర్ రెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్బంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూరాబోయే తరాలకు సాంప్రదాయాలను సంస్కృతికను తెలిసేలా ఆచరించాలని, తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ప్రతి సంవత్సరం గత 20 ఏళ్లగ ఆలయ ప్రాంగణంలో కవి సమ్మేళనాలను నిర్వహిస్తూ కవులను రచయితలను ప్రోత్సహించడం జరుగు తుందని అన్నారు. ప్రజలకు తమ సాహిత్యం ద్వారా మంచిని ప్రోత్సహించేలా, సామాజిక చైతన్యం కలిగించే, రచనలతో ఎంతో అభిమానిం పబడతారని కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు తమదైన కోణంలో వినిపించిన ప్రతి కవిత కూడా అందర్నీ ఆలోచింప చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ,కవి, మండల ఉత్తమ సాహితీ వేత్త అవార్డు గ్రహీత ఇమ్మడి రాంబాబు, ఆశు కవి కొనుగంటి కృపకర్ రాజు, దర్శకుడు రచయిత గట్టు నవీన్, బాతుక బుచ్చి రామయ్య, కస్తూరి పూలేందర్, నాలం శ్రీనివాస్, లత లు పాల్గొనగా వీరిని ఆలయ నిర్వాహక కమిటీ బాధ్యులు డాక్టర్ కే రాజేందర్ రెడ్డి డాక్టర్ కే.యాదగిరిరెడ్డి, తమ్మి ఉపేందర్, మల్యాల వెంకటేశ్వరరావు బోనగిరి శంకర్ కోనే ప్రభాకర్, వికాస్ తరంగిణి బాధ్యులుగీతారెడ్డి లక్ష్మి ప్రసూన శోభ రేణుక గీతా రాణి తో పాటు గాయకులు కొత్తపల్లి మధు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యం

**-ఏపీ జితేందర్ రెడ్డి బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు.**

**-బిజెపిలో చేరిన రిటైర్డ్ ఏఎస్పి డాక్టర్ సర్వేశ్వర్ రెడ్డి**

వనపర్తి ప్రతినిధి, మార్చ్23 (మనం న్యూస్): గోల్కొండ ఖిల్లా పై భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడమే తమ లక్ష్యమని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు పార్టీ చేరికల ఇన్చార్జి ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఏఎస్పీ డాక్టర్ సర్వేశ్వర్ రెడ్డి మరికొందరు తో కలిసి బిజెపి పార్టీలో చేరారు. ఏపీ జితేందర్ రెడ్డి స్వయంగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయ ఢంకా మోగించి తెలంగాణలో



అధికారం చేపట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేపడు తున్న అభివృద్ధిని చూసి చాలామంది బిజెపిలో చేరడానికి వస్తున్నారని అన్నారు. రిటైర్డ్ ఏఎస్పి డాక్టర్ సర్వేశ్వర్ రెడ్డి ప్రజా సేవ చేయడానికి బిజెపి పార్టీ అయితేనే మంచిదని భావించి పార్టీ లో చేరడం, లోక కళ్యాణార్థం సుదర్శన యాగం చేయడం అభినందనీయమని అలాంటి వ్యక్తి సేవలు పార్టీకి ఎంత అవసరమని చెప్పారు. డాక్టర్ సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో జాతీయ సమైక్యత ఒక ప్రధానమంత్రి మోడీ వల్లే సాధ్యమవుతుందని వారి పాలనా దక్షతను చూసి అంతర్జాతీయ పరంగా భారతదేశాని గొప్ప స్థానంలో నిలబెట్టిన విధానాలకు చూసి తాను ఎంతో ఉత్తేజం చెందానని అందుకే బిజెపి పార్టీలో చేరి ప్రజా సేవ చేయడానికి ముందుకు వచ్చానని చెప్పారు. తాను పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ఎల్లవేళలా పార్టీ కండగా ఉంటానని అన్నారు. కాగా సర్వేశ్వర్ రెడ్డి తో పాటు దాదాపు 20 మంది బిజెపి పార్టీలో చేరారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బి కృష్ణ, జిల్లా అధ్యక్షులు రాజ వర్ధన్ రెడ్డి పలువురు సీనియర్ నాయకులు మున్నూరు రవీందర్ డి. నారాయణ, బండారు కుమార స్వామి, బాశెట్టి శ్రీనివాసులు, జింకల కృష్ణయ్య, వెంకటేశ్వర్ రెడ్డి,బి జె వై ఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞ రెడ్డి, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి కవులను సన్మానించిన గోరటి వెంకన్న

వనపర్తి ప్రతినిధిమార్చ్23 (మనం న్యూస్): హైదరాబాద్ రవీంద్రభారతి లో బుధవారం తెలంగాణ సాహిత్య అకాడమీ,బాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభకృత్ నామ సంవత్సరఉగాది కవి సమ్మేళనం లో వనపర్తి పట్టణానికి చెందిన కవులు బైరోజు చంద్రశేఖర్, ఉప్పరి తిరుమలేష్ లు పాల్గొని తెలంగాణ సహజీవన సా మరస్య విలువలు అంశం పై కవి గానం చేశారు. ఈ సందర్బంగా శాసన మండలి సభ్యులుగోరటి వెంకన్న కవులను ఘనంగా సన్మానించి నగదు పారితోషకాన్ని అందచేశారు. రాష్ట్ర ప్రోహిబిషన్ శాఖ, సంస్కృతి కా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్,తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్,రాష్ట్ర బాషా సంస్కృతి క శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ లు కవులను అభినందించారు. సాహితి కళావేదికజిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్,కందూర్ నారాయణరెడ్డి,సత్తార్,చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు,డి రాములు వనపర్తి కవుల సన్మానం పై హర్షం వ్యక్తం చేశారు.



## గ్రామ పంచాయితీల అభివృద్ధికి కేసీఆర్ కృషి



తిరుమలగిరి మార్చి 23 మనం న్యూస్: దేశంలో ఎక్కడలేని విధంగా గ్రామ పంచాయితీల్లో ముఖ్యమంత్రి కేసిఆర్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని శాసన సభ్యులు గాదరి కిషోర్‌కూమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయితీ రాష్ట్ర స్థాయి పురస్కారం 2021-22 అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.... తండాలను గ్రామ పంచాయితీలుగా చేసి వాటి అభివృద్ధి కొరకు ప్రతి పంచాయితీకి రూ. 15 లక్షలు, తండాకు రూ. 10 లక్షలు ఇచ్చిన ఘనత ఒక్క కేసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. పల్లెల్లో ప్రకృతివనం, వైకుంఠ దామం, క్రీడాప్రాంగణం, ఏర్పాటుకు నిధులు మంజురు చేసి అభివృద్ధి వైపుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధిహామి పథకానికి రూ. 12 వందల కోట్లు నిలుపుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిదని తెలిపారు. అలాగే అర్వపెల్లి యోగానంద లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయానికి రూ. 5 కోట్లు మంజురు అయ్యాయని, తుంగతుర్తి 100 పడకల ఆసుపత్రికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. గ్రామల అభివృద్ధికి సర్పంచ్, ఎంపిటిసిలు పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. అనంతరం 9 అంశాలలో గ్రామాలను ఉత్తమంగా తీర్చిదిద్దిన గ్రామ పంచాయితీలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక, అధనపు కలెక్టర్ మోహన్‌రావు, డిపిఓ యాదయ్య, నాయకులు రజాక్, ఎంపిపి స్నేహలత, జడ్పీటిసి అంజలి, ఎంపిడిఓ ఉమేష్‌చారి, ఎపిఓ మారయ్య, వివిధ మండలాల ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిడిఓలు, తదితరులు హజరయ్యారు.

**వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే**



నియోజకవర్గంలోని నూతనకల్, మద్దిరాల, తుంగతూర్తి, నాగారం, తిరుమలగిరి మండలలా వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే గాదరి కిషోర్ కూమార్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.... ఇటివల కురిసిన ఆకాల వర్షాల కారణంగా అధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండాలలో ప్రాథమిక అంచనాల ప్రకారం 14429 ఎకారల పంట పోలాలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు సిఎం కేసిఆర్ ఎకరానికి రూ. 10వేల చోప్పున నష్ట పరిహారం అందజేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. దీంతో పాటు కౌలు రైతులను కూడా ఆదుకుంటామని తెలిపారు. వెంటనే నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నష్ట పోయిన రైతులను ప్రభుత్వం విధాలుగా ఆదుకుంటుందని, ఆధైర్య పడవద్దని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ జగ్గునాయక్, అధికారులు ప్రవంతి, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, గణేష్, వికాస్‌పాటీల్, మురళీబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే హరిప్రియ కృషి వల్లే సింగరేణి ప్రభావిత భూములలో

**-నివాసాలు ఏర్పరచుకున్న నిర్మాణాలకు జీఓ '76' ద్వారా లబ్ధి..**

**- టిఆర్ఎస్ పార్టీ ఇల్లందు పట్టణ అధ్యక్షులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి**



ఇల్లందు, మార్చి 23 (మనం న్యూస్) : స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లందు నూతనంగా ఏర్పాటైన టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఏజీవో నెంబర్ 76 ద్వారా సింగరేణి ప్రభావిత భూములలో ఆవాసాలు ఏర్పరచుకొని నివసిస్తున్న కుటుంబాలకు క్రమబద్ధీకరణ ద్వారా పూర్తి హక్కులు కల్పించాలంటూ అసెంబ్లీ సాక్షిగా ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యురాలు అభివృద్ధి ప్రదాత బానోత్ హరిప్రియ నాయక్ ముఖ్యమంత్రి కే.సీ.ఆర్. దృష్టికి పురపాలక శాఖ మంత్రి కే.టీ.ఆర్. దృష్టికి తీసుకువెళ్లిన ఫలితమే నేడు జీవో .76. ద్వారా సింగరేణి భూములలో నిర్మాణాలను క్రమబద్ధీకరించి వారి భూములకు పూర్తి హక్కులు కల్పించడంలో ఎమ్మెల్యే కృషి ఎనలేనిదని బి ఆర్ ఎస్ పార్టీ ఇల్లందు పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. వారికి పూర్తి హక్కులు కల్పించాలంటూ కేవలం గతంలో 2014లోపు ఇంటి పన్ను కడుతున్న వారికి క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వగా అలా కాకుండా క్రమబద్ధీకరణకు 2020 సంవత్సరంలోపు ఇంటి నిర్మా ణం చేపట్టి ఇంటి పన్ను కడుతున్న వారందరికీ వారి ఇంటిని క్రమబద్ధీకరి ంచుకోవడంలో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కృషి ఎనలేని ఎప్పటికప్పుడు సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి వెళ్లి సమస్య అనంతరం బిఆర్ ఎస్ పార్టీ ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నెంబర్ 76 మార్గదర్శకా లను త్వరలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్. వైస్ చైర్మన్. మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్లు. ప్రజలకుతెలియజేస్తారని.ఈసదవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఇల్లందు పట్టణ ఇంచార్జ్ సుధీర్.తోట్ల( బబ్లూ)ఇల్లందు పట్టణ ఉపా ధ్యక్షుడు పెండ్యాల హరికృష్ణ, టౌన్ కమిటీ ఎండి. యాకూబ్, పర్రె శ్రీనివాస్, రాచపల్లి శ్రీనివాస్, సనా రాజేష్ , మేకలు శ్యామ్ , ఆదూరి రవి, పాల్గొన్నారు.

## దళిత బంధు పథకంతో దళితుల జీవితాల్లో మార్పులు

**మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పలుస రమేష్ గౌడ్**



వనపర్తి ప్రతినిధి, మార్చ్ 23 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో దళిత బంధు పథకం తో దళితులు సామాజికంగా ఆర్థిక ంగా స్వాతంత్రంగా ఎదగ డానికి సహాయ పడిందని పారిశ్రామిక సామర్థ్య మెరుగుప రుస్తున్నదని, వనపర్తి జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు గట్టు యాదవ్,మార్కెట్ యార్డ్ చైర్మన్ పలుస రమేష్ గౌడ్ అన్నారు. వనపర్తి పట్టణం హరిజనవాడలో తెలం గాణ రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహకారంతో ధ్యారపోగు శ్రీను దళిత బంధు పథకంలో మంజూరైనా సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో దళితుల అభివృద్ధికి సంబంధించి సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో అద్భుత పథకం దళిత బంధు పథకం అని ఈ పథకం కింద దళిత ఖాతాల్లో 10 లక్షల రూపాయలు జమ చేసి ఆర్థికంగా ఎదగడానికి ప్రోత్సాహిస్తున్నట్టు దళితుల జీవితాల్లో అద్భుతాలను సాధిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో18వ వార్డు కౌన్సిలర్ గంధం సత్యమ్మ శరవంద, భారతి ప్రేమనాథ్ రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ గంధం, పరంజ్యోతి, డి, తిరుపతయ్య, గంధం విజయకుమార్, డి, దానెలు, గోర్ల ప్రేమ్ కుమార్, రఘునాయుడు పాల్గొన్నారు.

## నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకునే భక్తులకు ఉచిత ఆటో సర్వీసులుఆటో యూనియన్ల ఔదార్యం



గుంతకల్లు,న్యూస్ మార్చి 23 మనం : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాలు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని భగత్ సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఉచిత ఆటోలు నడుపుతున్నట్లు ఆటోల యూనియన్ నాయకుడు జిల్లా కార్యదర్శి సాకే నాగరాజు తెలిపారు ప్రజలు భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలియజేశారు ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు మరియు రథోత్సవం జరుగుతున్న దృష్ట్యా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం వలన ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు.

## వృద్ధురాలిపై దాడి



మదనపల్లె క్రైమ్,మార్చి 23, మనం న్యూస్ : భూవివాద గొడవల్లో భాగంగా ఓ వృద్ధురాలిపై ఆమె దాయాదులు దాడి చేశారు. కలకడ మండలం ఎనుగొండపాళెం పంచాయతీ బద్దిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకట్రమణ భార్య వెంకటలక్ష్మమ్మ (65) వ్యవసాయ పనులు చేస్తుండేది. ఈమె కుటుంబీకులు కొంతకాలం కిందట బోరు వద్ద దాయాదుల పొలంలో వైపులు పూడ్చారు. కాగా అవి తొలగించే విషయమై కొద్దిరోజులుగా ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో ఆవేశానికి గురైన తోడికోడలు రెడ్డెమ్మ, ఈమె కుమార్తె.లక్ష్మీదేవిలు వెంకటలక్ష్మమ్మపై దాడి చేశారు. గాయపడిన ఈమెను కుటుంబీకులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

## జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల పరిశీలన..



ఉరవకొండ, మార్చి 23, మనం న్యూస్: ఉరవకొండ పట్టణంలోని కొలిమి లేఔట్ లో ఉన్న జగనన్న కాలనీలో గురువారం ఎంపీపీ చంద్ర చంద్రమ్మ మరియు ఎం బసవరాజు మరియు ఎంపీడీవో చంద్రమౌళి ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులతో కలసి పర్యటించి, స్థానికంగా ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీలో మొదటి లైన్ లో వాటర్ ట్యాంక్ లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని లబ్ధిదారులు ఎంపీపీదృష్టికి తెచ్చారు. దీనితో పాటు ప్రస్తుతమున్న కొన్ని ట్యాంకుల మోటార్లు చెడిపోవడంతో నీటి కొరత ఏర్పడిందని లబ్ధిదారులు తెలిపారు. సమస్యను గుర్తించిన ఎంపీపీ, ఎంపీడీవో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## విద్యారంగానికి గోపాలకృష్ణ గోఖలే, సేవలు ఎంతో గొప్పవి



బళ్లారి, మార్చి 23, మనం ప్రతినిధి: విద్యారంగానికి ఎనలేని సేవలు అందించిన గోపాలకృష్ణ గోకులే సేవలు ఎంతో గొప్పవని, కర్ణాటక క్రియాశీల ఉపాధ్యాయుల సంఘం, జిల్లా అధ్యక్షుడు, రవి చల్ల గురి కి అన్నారు. గురువారం తాలూకా పరిధిలోని సంజీవరాయన కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గోపాలకృష్ణ గోఖలే చిత్రపటానికి పూలమాలవేసి మాట్లాడారు. బాలగంగాధర్ తిలక్ ఆదర్శాలను అలవడించుకొని, విద్యారంగానికి ఎనలేని సేవలు, అందించడంతోపాటు ఎంతోమంది యువకులను తీర్చిదిద్దారన్నారు. ఆయన ఆదర్శాలను నేటి యువత పాటిస్తూ ఆయన బాటలు పయనించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలోపాఠశాలఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## దర్గా హోన్నూర్ గ్రామంలో రాతిదూలం లాగుడు పోటీలు



బొమ్మనహాల్ మనం న్యూస్: మండల పరిధిలోని దర్గా హొన్నూర్ గ్రామంలో సోభ కృత్ నామ సంవత్సర తెలుగు వారి ఉగాది పండుగను పురస్కరించుకుని దర్గా హొన్నూరు గ్రామంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్ వై. కేశప్ప ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ లాగుడు పోటీలలో గెలుపొందిన వివరాలు ఇలా మొదటి బహుమతిగా లింగ దహళ్ ఎర్రి స్వామి గెలుపొందగా దాత మాజీ సర్పంచ్ వై. కేసన్న చేతుల మీదుగా బహుమానం బహుకరించారు. రెండవ బహుమతి ఆ గ్రామానికి చెందిన గౌరేష్ గెలుపొందారు ఈ రెండవ బహుమతి దాత వై. హనుమంతు చేతుల మీదుగా బహుకరించారు. మూడవ బహుమతి ఎ. మల్లి గెలపొందగా తాత ఆనంద్ నాగరాజు రఫీ చేతుల మీదుగా బహుకరించారు. నాలుగవ బహుమతి గోవిందవాడ మారిన గెలుపొందగా దాత కుమ్మరి వన్నూరప్ప చేతుల మీదుగా బహుకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీఎల్ఆర్ రాజప్ప, రామస్వామి గోవిందు కేసీఆర్ నాగప్ప, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కో ఎకరానికి..

**-రూ.10 వేల నష్టపరిహారం**

**-రైతులు అధైర్యపడొద్దు.. అన్ని విధాలా ఆదుకుంటాం**

**-రాష్ట్రవ్యాప్తంగా 2.22 లక్షల ఎకరాల్లో పంట నష్టం**

**-దేశానికి కొత్త అగ్రికల్చర్ పాలసీ అవసరం**

**-కేంద్రానికి నివేదికలు పంపడం లేదు**

**-పంట నష్టంపై కేంద్రాన్ని అర్థించేది లేదు**

**-కేంద్రానికి చెప్పినా దున్నపోతుకు చెప్పినా ఒకటే**

**-బీజేపీకి రాజకీయాలు తప్ప రైతుల బాధలు పట్టవు**

**-సీఎం కె.చంద్రశేఖర్ రావు**











వర్షాలకు నష్టపోయిన పంటల పరిశీలన

మధిర/ బోనకల్/ పెద్దవంగర/ వరంగల్/ కరీంనగర్ మార్చి 23 (మనం న్యూస్) : ఇటీవలి అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేలు పునరావాస సహాయం అందజేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల, గార్లపాడు గ్రామాల్లో వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో ముఖ్యమంత్రి పరిశీలన చేశారు. అనంతరం మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిలతో కలిసి రావినూతలలోని హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వాస్తవానికి రైతులకు ఇచ్చే దాన్ని నష్టపరిహారం అనరని, సహాయ పునరావాస చర్యలు అని అంటారని తెలిపారు. రైతులకు అండగా ఉంటూ, అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. గాలివాన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 22వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మొక్కజొన్న 1,29,446, వరి 72,709, మామిడి 8,865, ఇతర పంటలు అన్ని కలిసి 17,238 ఎకరాల్లో నష్టం జరిగింది. ప్రపంచంలోనే ఎక్కడా లేనటువంటి రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. ఫలితంగా వ్యవసాయం ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుని రైతులు స్థిరపడే పరిస్థితికి వస్తున్నారని, అప్పుల నుంచి కూడా తేరుకుంటున్నారని అన్నారు. వ్యవసాయం దండగ అని చెప్పే మూర్ఖులు ఇప్పటికీ చాలామంది ఉన్నారని, ఈ మాటలు చెప్పేవాళ్లలో ఆర్థికవేత్తలు కూడా ఉన్నారని, మేం గర్వంగా చెబుతున్నాం ఇవాళ తెలంగాణ భారతదేశంలోనే నంబర్‌వన్‌గా ఉందన్నారు. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కంటే కూడా అత్యధికంగా తలసరి ఆదాయం రూ. 3,05,000తో మన రాష్ట్రం ఉందన్నారు. జీఎస్డీపీ పెరిగితేనే తలసరి ఆదాయం పెరుగుతుందని, జీఎస్డీపీ పెరుగుదలలో వ్యవసాయం పాత్రే అధికంగా ఉందని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఈ వాటా 21 శాతం ఉండగా, సరాసరి 16 శాతం వరకు ఉందని సీఎం తెలిపారు. అద్భుతమైన వ్యవసాయ రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చెందిందని, ఇది మనకు చాలా గర్వకారణమని తెలిపారు. రైతులు నిరాశకు గురికావద్దని, ప్రభుత్వం అండదండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇంకా అద్భుతమైన వ్యవసాయ రాష్ట్రంగా రూపుదాల్చాలని చెప్పారు. ఈ దేశంలో ఓ పాలసీ లేదని, ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభం కలిగించే బీమాలే ఉన్నాయి తప్ప, రైతులకు లాభం చేసేవి లేవన్నారు. భారతదేశానికే కొత్త అగ్రికల్చర్ పాలసీ కావాలన్నారు. గతంలో జరిగిన నష్టాలకు సహాయం కోసం నివేదికలు పంపితే కేంద్రం నుండి సహాయం రాలేదని, అందుకే ఈసారి కేంద్రానికి నివేదిక పంపాలని అనుకోవట్లేదని సీఎం తెలిపారు. భగవంతుడు తెలంగాణకు ఆర్థిక శక్తి ఇచ్చాడని, మా రైతులను మేమే కాపాడుకుంటామని, వంద శాతం మేమే ఆదుకుంటామని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మొక్కజొన్నకు అయితే ఎకరానికి రూ.3,333 లు, వరి చేళ్లకు రూ. 5,400 లు, మామిడి తోటలకు రూ. 7,200 ఇస్తామని స్కీంలో ఉందన్నారు. ఇది ఏ మూలకు సరిపోదు కాబట్టి రైతులను మేమే ఆదుకుంటామని సీఎం కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఉచిత కరెంట్, ఉచిత నీళ్లు, వాటర్ సెస్ బకాయి రద్దు చేసి రైతులను ఆదుకోవడం వల్ల వ్యవసాయం ఇప్పుడిప్పుడే బాగుపడుతుం దన్నారు. ఆ స్థితిని దెబ్బతీయనివ్వకూడదని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం కానివ్వమని సీఎం అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు నిరాశపడొద్దని, ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఆయన తెలిపారు. నష్టపరిహారం అనేది ప్రపంచంలో ఎవరూ ఇయ్యలేరని, రైతులు మళ్లీ పుంజుకుని, వ్యవసాయం చేసేందుకు వీలుగా సహాయ సహకారాలు అందించాలని, అందుకే ఎకరానికి 10వేలు ప్రకటిస్తున్నానని, వెంటనే వీటిని అందజేస్తామని ఆయన అన్నారు. స్థానిక మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కౌలు రైతులను కూడా ఆదుకుంటామని, ఈ డబ్బును నేరుగా రైతులకు ఇవ్వకుండా, ప్రతి రైతుతో పాటు కౌలు రైతులను కూడా పిలిపించి ఆదుకునేలా కలెక్టర్ కు ఆదేశాలిస్తామని అన్నారు. పంటకు పెట్టుబడి పెట్టింది కౌలు రైతులే కాబట్టి వాళ్లకు న్యాయం జరిగేలా చూస్తామని, జరిగిన నష్టానికి ఏ మాత్రం చింతించకుండా, రబ్బర్ బంతి తిరిగొచ్చినట్లుగా, భవిష్యత్తులో ఉన్నతమైన పంటలను పండించే ఆలోచనతో రైతులు ముందుకు పోవాలని, ఎట్టిపరిస్థితుల్లో ధైర్యాన్ని వీడొద్దని సీఎం రైతుల్లో భరోసా నింపారు. రాష్ట్రంలో పంట దెబ్బతిన్న 2.28 లక్షల ఎకరాలకు రూ. 228 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, జోగినపల్లి సంతోష్ కుమార్, రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జెడ్పి చైర్మన్ లింగాల కమల్ రాజ్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, రాములు నాయక్, మెచ్చ నాగేశ్వరరావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు,అదనపు కలెక్టర్లు స్నేహ లత మొగిలి, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసి పల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రెతులు అధైర్యపడొద్దు..**

ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వానకు మండలంలోని అన్ని రకాల పంటలు ధ్వంసమైనందున పంచాయతీ రాజ్ మరియు ఆర్‌డబ్ల్యూఎస్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని పోచారం గ్రామ శివారు వద్ద రెడ్డికుంట తండా పరిసర ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే నిర్వహించారు, ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో ముచ్చటిస్తూ వరి, మిర్చి, మామిడి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నష్టపోయాయని రైతులు తమ గోడును ముఖ్యమంత్రికి వివరించారు, పంటనష్ట తీవ్రత ఎక్కువగా ఉందని అకాలంగా కురిసిన వడగళ్ల వానకు ప్రతి ఒక్క పంట నాశనం అయింది కాబట్టి మీరే మా రైతుల పక్షపాతిగా నిలబడి పంట నష్టపరిహారం ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున ఇవ్వాలని కోరుకున్నారు, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నేను ఒక రైతు బిడ్డనే అని, వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి మరియు దయాకర్ రావు కూడా వ్యవసాయ రైతులే అని, మాకు వ్యవసాయదారుల కష్టాలు తెలుసు కాబట్టే వ్యవసాయాన్ని కిందికి పడనీయొద్దువెనకకు పోనీయొద్దు అని, హైదరాబాదులో కూర్చొని 10వేలు ప్రకటించ గలను కానీ, రైతులందరికీ ధైర్యం చెప్పడానికే మీ ముందుకు వచ్చానని మునుపటిలాగా ప్రకటించిన ఆరు నెలలతో సంవత్సరానికి పంట నష్టపరిహారం అందేదని, దొంగలు పడ్డంక ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు కాకుండా ఇప్పుడు ఇచ్చే పంట నష్టపరిహారం తొందరగానే మీ అకౌంట్లోకి పడతాయని, అదేవిధంగా కౌలు రైతులకు కూడా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్క రైతుకు ఎకరాకు పదివేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కేసీఆర్ తిలకించారు, ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యవతి రాథోడ్, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ పల్ల రాజేశ్వర్ రెడ్డి,ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్యే డి ఎస్ రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, సీఎం ఓఎస్డి స్మితసబర్వాల్, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, మహబూ బాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక్, అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**నర్సంపేట మండలంలో పంటల పరిశీలన**

అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా దెబ్బతిన్న పంటలను ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పరిశీలించారు. సీఎంకు స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిపిలు, ఇతర ప్రముఖుఘన స్వాగతం పలికారు. నర్సంపేట నియోజ కవర్గంలోని దుగ్గొండి మండలం అడవి రంగాపురం గ్రామంలో పర్యటించి పంట నష్టపోయిన రైతులతో నేరుగా మాట్లాడారు నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ 10000/- చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అందరూ తెలంగాణ రైతులే కాబట్టి, కౌలు రైతులను కూడా ఆదుకోవాలని తెలియజేసుకుంటున్నాను కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయడం లేదుకాబట్టి మన రైతులను మనమే కాపాడుకుందాం అనే ఉద్దేశంతో నష్టపరిహారం మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం మాత్రమే భరిస్తుంది నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ 10000/- చొప్పున నష్టపరిహారం చెల్లిస్తాము నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. రైతులకు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను రైతులు ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలకు అధైర్య పడకుండా ముందుకు సాగాలని దానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

**పంట నష్టంపై కేంద్రాన్ని అర్థించేది లేదు**

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తెలంగాణలో జరిగిన పంట నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపి వారిని అర్థించేది లేదని, రాష్ట్రంలోని రైతులతో పాటు కౌలు రైతులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. అన్నదాతలకు అందించేదాన్ని నష్టపరిహారం అనరని, దాన్ని సహాయ పునరావాస చర్యలుగా పరిగణిస్తామన్నారు. ఎలాంటి పరిస్థితులెదురైనా అన్నదాతల్లో ధైర్యం చెడకూడదని, అన్ని విధాలా కంటికి రెప్పలా కాపాడుకునేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందని భరోసానిచ్చారు. పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు పది వేల రూపాయల చొప్పున పరిహారాన్ని అందిస్తామని ఆయన హామీనిచ్చారు. సిఎం కెసిఆర్ కరీంనగర్ జిల్లాలోని పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వర్షప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయం నుండి ఖమ్మం, వరంగల్, మహబూబాద్ జిల్లాల్లో పర్యటించిన కెసిఆర్ మధ్యాహ్నం 4 గంటలకు హెలికాప్టర్ ద్వారా జిల్లాలోని రామడుగు మండలం లక్ష్మీపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినిపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అకాల వర్షాలతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన సిఎం కెసిఆర్ రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కేవలం రాజకీయాలు చేయడం తప్ప, అన్నదాతల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. దేశంలో ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభం కలిగించే బీమాలే ఉన్నాయి తప్ప, రైతులకు అండగా నిలిచే బీమాలు, కేంద్ర ప్రభుత్వ పాలసీలు లేవన్నారు. భారతదేశంలో కొత్తగా వ్యవసాయ పాలసీ రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇప్పుడు దేశంలో ఒక డ్రామా నడుస్తోందని, ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం మరీ దుర్మార్గంగా ఉందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగానే తాము పంట నష్టంపై వారికి నివేదిక పంపాలనుకోవడం లేదని, రాష్ట్ర రైతులను తామే వందశాతం కాపాడుకుంటామని వ్యాఖ్యానించారు.



## లీకేజీ వ్యవహారం.. కేటీఆర్ నుంచి ఎందుకు సమాచారాన్ని సేకరించలేదు?

**టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, మార్చి 23 (మనం న్యూస్): నిరుద్యోగుల సమస్యలను దృష్టిలో పెట్టుకొనే సిట్ విచారణకు హాజరైనట్లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసులో దర్యాప్తులో భాగంగా ఆరోపణలు చేస్తున్న వారందరికీ సిట్ అధికారులు నోటీసులు జారీ చేస్తోన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా నోటీసులు అందుకున్న రేవంత్ రెడ్డి ఇవాళ విచారణకు హాజరయ్యారు.విచారణ అనంతరం బయటకు వచ్చిన రేవంత్ మీడియాతో మాట్లాడారు. ఆరోపణలు చేస్తున్న అందరికీ సిట్ నోటీసులు జారీ చేస్తోందని.. అలా అయితే మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. కేటీఆర్ వద్ద సంపూర్ణమైన సమాచారం ఉందని చెప్పారు. పూర్తి వివరాలు కేటీఆర్ వద్ద ఉన్నాయని సిట్ దర్యాప్తు అధికారి ఏఆర్ శ్రీనివాస్‌కు విచారణ సందర్భంగా రేవంత్ చెప్పానన్నారు. నేరస్థులను విచారించకుండానే కేటీఆర్ పూర్తి సమాచారం చెప్పారని.. కేటీఆర్ నుంచి సిట్ అధికారులు ఎందుకు సమాచారాన్ని సేకరించలేదని రేవంత్ ప్రశ్నించారు.

## వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు

**-ఉభయ సభలను కుదిపేసిన అదానీ సంక్షోభం**

**-జేపీసీకి బీఆర్ఎస్, విపక్షాల పట్టు**

**-కొనసాగిన వాయిదాల పర్వం**

**-పార్లమెంట్ వన్ గేటు వద్ద నినాదాలతో పెద్ద ఎత్తున ధర్నా**

**-ప్లకార్డులతో సభ్యులు చేసిన నినాదాలతో మార్మోగిన పార్లమెంట్**

**-వాయిదాలు వద్దు.... జేపీసీ కావాలి**

**-ఎంపీ నామ నాగేశ్వరరావు డిమాండ్**



ఖమ్మం, మార్చి 23 (మనం బ్యూరో) : బీఆర్ఎస్ ఎంపీల నిరంతర ఆందోళనతో గురువారం కూడా అదానీ అంశంపై పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించాయి.లోక్ సభ ప్రారంభం కాగానే ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేయాల్సిందేనని పట్టుపట్టి డిమాండ్ చేస్తూ ఎంపీలు చేసిన నినాదాలతో పార్లమెంట్ మార్మోగింది. దీంతో స్పీకర్ ఉభయ సభలను వాయిదా వేయగానే , ఎంపీలంతా నామ నాగేశ్వరరావు నాయకత్వంలో పార్లమెంటు ఒకటో నెంబర్ గేట్ వద్దకు చేరుకుని విపక్షాలతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని, ఆందోళన కొనసాగించారు. కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ అదానీ సంక్షోభం ఉభయ సభలనూ ఇన్ని రోజులుగా కుదిపేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి పట్టకపోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.అయినా సరే జెపిసి వేసేంతవరకు రెట్టింపు ఉత్సాహంతో ఆందోళన కొనసాగిస్తామని నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇప్పటికైనా మోదీ దిగొచ్చి అదానీ అంశంపై జేపీసీ వేసి, ఉభయ సభల్లో చర్చకు అనుమతించాలని నామ డిమాండ్ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అన్నారు.దేశ ప్రజలకు కావాల్సింది సభలు వాయిదా కాదని , అదానీ అంశంపై జేపీసీ సభల్లో చర్చ అని నామ పేర్కొన్నారు.

## మన డేటాను అమ్మేస్తున్నారు..

**-దేశవ్యాప్తంగా 16 కోట్ల మంది వ్యక్తిగత డేటా చోరీ**

**-సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర**

**-అతిపెద్ద సైబర్ స్కామ్‌ను బయటపెట్టిన సైబరాబాద్ పోలీసులు**

**-ఆరుగురు నిందితుల అరెస్ట్**



హైదరాబాద్, మార్చి 23 (మనం న్యూస్): దేశంలో అతిపెద్ద సైబర్ స్కామ్‌ను సైబరాబాద్ పోలీసులు బట్టబయలు చేశారు. దేశవ్యాప్తంగా కోట్ల మంది వ్యక్తిగత డేటాను చోరీ చేసిన ముఠాను ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. 16 కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత డేటాను చోరీ చేసి విక్రయించినట్లు గుర్తించారు. హైదరాబాద్ నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వందల సంఖ్యలో కేసులు నమోదైన క్రమంలో ఈ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సైబరాబాద్ పరిధిలో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. నాగ్‌పూర్, ఢిల్లీతో పాటు ముంబైకి చెందిన ముఠాగా గుర్తించినట్లు చెప్పారు. ఆర్మీకి చెందిన రెండున్నర లక్షల మంది డేటా కూడా చోరీ అయినట్లు నిర్ధారించారు. ఈ మేరకు వివరాలను సీపీ మీడియాకు వెల్లడించారు.'దేశ భద్రతకు భంగం కలిగేలా సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత డేటాను అపహరిస్తున్నారు. బీమా, లోన్లకు అప్లై చేసిన నాలుగు లక్షల మంది డేటా చోరీకి గురైంది. కోట్లాదిగా సోషల్ మీడియా ఐడీలు, పాస్‌వర్డ్‌లు కూడా లీకయ్యాయి. ఆర్మీకి చెందిన రెండున్నర లక్షల మంది డేటా, ఢిల్లీలో 35 వేల మంది ప్రభుత్వ ఉద్యోగుల డేటా చోరీకి గురైంది. కేటు గాళ్లు ఇన్సూరెన్స్, క్రెడిట్ కార్డులు, లోన్ అప్లికేషన్ల నుంచి వివరాల సేకరిస్తు న్నారు. డేటా చోరీ గ్యాంగ్‌లకు ఆయా కంపెనీల్లో కొందరు ఉద్యోగులు సాయ ం చేస్తున్నారు. సెక్యూరిటీ ఉందనుకున్న బ్యాంక్ అకౌంట్ల నుంచి కూడా నేర గాళ్లు చోరీలకు పాల్పడుతున్నారు. సేకరించిన వ్యక్తిగత డేటాను విచ్చల విడిగా అమ్మేస్తున్నారు.ఇప్పటికేపలు ముఠాలను అరెస్ట్ చేశాం' అని సీపీ వివరించారు.

## పేపర్ లీకేజీ కేసు.. ముగ్గురికి 14 రోజుల రిమాండ్




హైదరాబాద్, మార్చి 23 (మనం న్యూస్): టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో నాంపల్లి కోర్టు ముగ్గురికి రిమాండ్ విధించింది. ఈ కేసులో గురువారం అరెస్టయిన రమేశ్, సురేశ్, షమీమ్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. 2013లో గ్రూప్-2 ఉద్యోగం పొందిన షమీమ్‌కు గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 127 మార్కులు, టీఎస్పీఎస్సీలో పొరుగుసేవల ఉద్యోగిగా పని చేస్తున్న రమేశ్‌కు 122 మార్కులు వచ్చినట్లు సిట్ బృందం గుర్తించింది. లీకేజీ కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న రాజశేఖర్ నుంచి గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం తీసుకున్నట్లు షమీమ్ తెలిపాడు. దీనికోసం డబ్బులేమీ తీసుకోలేదని చెప్పాడు. దీంతో షమీమ్ ఇచ్చిన ఆధారాల మేరకు వీరిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. అనంతరం నిందితులను నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు కోర్టు ఆదేశాలతో నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఐపీఎల్‌లో ఆటగాళ్ల పనిభారంపై ఫ్రాంచైజీలదే బాధ్యత: రోహిత్ శర్మ

న్యూఢిల్లీ: త్వరలో ప్రారంభంకానున్న ఐపీఎల్ వల్ల ఆటగాళ్లపై పనిభారం పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఫ్రాంచైజీలదేనని భారత కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. ఈ ఏడాది చివర్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సైతం ఐపీఎల్ అనంతరం జరుగుతుంది. ఈ రెండు కీలక టోర్నమెంట్ల దృష్ట్యా ఆటగాళ్లు ఫిట్‌గా ఉండాలంటే ఒత్తిడి ఉండకూడదు. రెండు నెలల పాటు జరిగే ఐపీఎల్ వల్ల ఆటగాళ్లు పనిభారంతో ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే టీమ్‌ఇండియాకు కీలకమైన ఆటగాళ్లు గాయాల కారణంగా దూరమయ్యారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే జస్ప్రీత్ బుమ్రా, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్.. ప్రపంచకప్, టెస్టు ఛాంపియన్షిప్లో ఆడే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. గాయాల కారణంగా బుమ్రా, శ్రేయస్ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడలేదు. డిసెంబర్ 2022లో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన పంత్ పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుంది. వన్డేల్లో నిలకడగా పరుగులు



సాధించే శ్రేయస్ అయ్యర్ వెన్ను సర్జరీ కారణంగా ఐదు నెలల పాటు అందుబాటులో ఉండడని సమాచారం. ఐపీఎల్ వల్ల ఇతర ఆటగాళ్లు కూడా గాయాలపాలైతే టీమ్‌ఇండియా ప్రపంచకప్లో రాణించడం కష్టమవుతుంది. కాబట్టి ఆటగాళ్ల పనిభారంపై దృష్టి పెట్టడం ఐపీఎల్ ఫ్రాంచైజీల బాధ్యతేనని రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. ఆటగాళ్లు ఫిట్గా ఉండేలా టీమ్‌ఇండియా యాజమాన్యం ఇప్పటికే సూచనలు చేసిందని తెలిపాడు. ''ఆటగాళ్లపై పనిభారం పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఫ్రాంచైజీలదే. ఎందుకంటే వారే ఆటగాళ్లను సొంతం చేసుకున్నారు. మేం అన్ని జట్లకు సూచనలిచ్చాం. ప్రపంచకప్ వరకు ఫిట్గా ఉండాల్సిన బాధ్యత ఆటగాళ్లదే'' అని రోహిత్ పేర్కొన్నాడు. ఐపీఎల్లో కొన్ని మ్యాచ్ల నుంచి విశ్రాంతి తీసుకునే అవకాశం ఆటగాళ్లకు ఉంటుంది. కానీ అది కచ్చితంగా జరుగుతుందని చెప్పలేం. ''విశ్రాంతి తీసుకోవాలని ఆటగాళ్లు భావిస్తే తమ జట్టు యాజమాన్యాలతో, ఫ్రాంచైజీలతో చర్చించి ఒకటి రెండు మ్యాచులకు విరామం తీసుకోవచ్చు. కానీ వారు అనుమతిస్తారా లేదా అనేది అనుమానమే'' అని రోహిత్ అభిప్రాయపడ్డాడు.మార్చి 31 నుంచి ఐపీఎల్ ప్రారంభమవుతుంది. మొదటి మ్యాచ్ గుజరాత్, చెన్నై జట్ల మధ్య అహ్మదాబాద్‌లో జరగనుంది. ఫైనల్ మ్యాచ్ మే 28న జరుగుతుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ జూన్ 7 నుంచి ప్రారంభంకానుంది.

## ఐపీఎల్ 2023కు ముందు కేకేఆర్‌కు మరో ఎదురుదెబ్బ



కోల్‌కతా: ఐపీఎల్ 2023 ప్రారంభానికి ముందు టూ టైమ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్రైడర్స్ మరో ఎదురుదెబ్బ తగిలింది. వెన్ను సమస్య కారణంగా ఇప్పటికే ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ లీగ్ మొత్తానికే దూరం కాగా.. తాజాగా స్టార్ బౌలర్, న్యూజిలాండ్ ఆటగాడు లోకీ ఫెర్గూసన్ గాయం (హ్యామ్‌స్రిటంగ్) బారిన పడ్డాడు. స్వదేశంలో శ్రీలంకతో జరగాల్సిన వన్డే సిరీస్‌కు ముందు ఫెర్గూసన్ గాయం వార్త వెలుగు చూసింది. దీంతో అతను మార్చి 25న జరిగాల్సిన తొలి వన్డే బరి నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో కివీస్ క్రికెట్ బోర్డు ఎవరినీ ఎంపిక చేయలేదు. శ్రీలంకతో తొలి వన్డేకు మాత్రం ఫెర్గూసన్ దూరంగా ఉంటాడని కివీస్ యాజమాన్యం ప్రకటించింది. అయితే, ఫెర్గూసన్ గాయం తీవ్రతపై న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు కానీ కేకేఆర్ యాజమాన్యం కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.ఒకవేళ ఫెర్గూసన్ గాయం బారిన పడకుండి ఉంటే, తొలి వన్డే తర్వాత ఐపీఎల్ ఆడేందుకు భారత్కు పయనమవ్వాల్సి ఉండింది. ఫెర్గూసన్ గాయంపై ఎలాంటి అప్డేట్ లేకపోవడంతో కేకేఆర్ యాజమాన్యం కలవర పడుతుంది. ఇప్పటికే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సేవలు కోల్పోయిన ఆ జట్టు, ఫెర్గూసన్ సేవలను కూడా కోల్పోతే భారీ మూల్యం తప్పదని భావిస్తుంది.ఫెర్గూసన్ కొన్ని మ్యాచ్లకు దూరమైనా పేస్ బౌలింగ్ భారమంతా టిమ్ సౌథీపై పడుతుంది. ఐపీ ఎల్ 2023 ప్రారంభా నికి మరో 8 రోజులు మాత్రమే ఉన్నా కేకేఆర్ ఇప్పటికీ తమ నూతన కెప్టెన్ పేరును (శ్రేయస్ రీప్లేస్మె ంట్) ప్రకటించలేదు.ఫెర్గూసన్ గతేడాది ఐపీఎల్లో గుజరాత్ టైటాన్స్కు ప్రాతి నిధ్యం వహిం చాడు. 2023 వేలంలో కేకేఆర్ అతన్ని సొం తం చేసుకుంది. కేకేఆర్ ఏప్రిల్ 2న జరిగే తమ తొలి మ్యాచ్లో పంజాబ్ కింగ్స్తో తలపడనుంది.

## వన్డేల్లో అగ్ర స్థానాన్ని కోల్పోయిన భారత్

న్యూఢిల్లీ: చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన జరిగిన మూడో వన్డేలో 21 పరుగుల తేడాతో టీమిండియా ఓటమిపాలైన సంగతి తెలిసిందే. తద్వారా మూడు వన్డేల సిరీస్‌ను 1-2 తేడాతో భారత్ కోల్పోయింది. కాగా గత నాలుగేళ్లలో స్వదేశంలో టీమిండియా సిరీస్‌ను కోల్పోవడం ఇదే తొలి సారి. మార్చి 2019 నుంచి అన్ని ఫార్మాట్లలో వరుసగా 24 సిరీస్‌లలో టీమిండియా విజయం సాధించింది. చివరగా 2019 ఆరంభంలో ఆసీస్‌పైనే



భారత్ సిరీస్‌ను కోల్పోయింది.అదే విధంగా రోహిత్ శర్మకు పూర్తి స్థాయి కెప్టెన్‌గా స్వదేశంలో ఇదే తొలి సిరీస్ ఓటమి కావడం గమనార్హం. ఇక సిరీస్‌లో ఓటమిపాలైన టీమిండియా.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన్ని కూడా కోల్పోయింది. ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో స్థానానికి పడిపోయింది. ఆసీస్‌తో 113 రేటింగ్ పాయింట్లతో టీమిండియా సమంగా ఉన్నప్పటికీ.. మ్యాచ్ విన్నింగ్ శాతం పరంగా కంగారూ జట్టు టాప్ ర్యాక్‌కు చేరుకుంది. టీమిండియా తరువాతి స్థానంలో 111 రేటింగ్ పాయింట్లతో న్యూజిలాండ్ నిలిచింది.

## సురేశ్ రైనా విశ్వరూపం.. 45 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లు



న్యూఢిల్లీ: లెజెండ్స్ లీగ్ క్రికెట్-2023 పూర్తయిన వెంటనే మరో లెజెండ్స్ క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఘాజియాబాద్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో నిన్న (మార్చి 22) ఇండోర్ నైట్స్, నాగ్పూర్ నింజాస్ జట్లు తలపడగా.. ఇండోర్ నైట్స్ 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోర్ నైట్స్.. ఫిల్ మస్టర్డ్ (39 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), సురేశ్ రైనా (45 బంతుల్లో 90 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోర్ చేసింది.నింజాస్ బౌలర్లలో కుల్దీప్ హుడా 4 వికెట్లు పడగొట్టగా.. ప్రిన్స్ 2 వికెట్లు దక్కించుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన నింజాస్ను కుల్దీప్ హుడా (42 బంతుల్లో 77; 7 ఫోర్లు, 5 సిక్సర్లు) గెలిపించేందుకు విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయి ంది. బౌలింగ్లో చెలరేగిన హుడా బ్యాటింగ్లోనూ విజృంభించి తన జట్టును గెలిపించేందుకు విఫల యత్నం చేశాడు. నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి నింజాస్ 7 వికెట్లు కోల్పోయి 198 పరుగులకు పరిమితం కావడంతో 11 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.ఇండోర్ బౌలర్లలో కపిల్ రాణా 3, రాజేశ్ ధాబి 2, జితేందర్ గిరి, సునీల్ చెరో వికెట్ పడగొట్టారు. నింజాస్ ఇన్నింగ్స్‌లో రిచర్డ్ లెవి (13), వీరేంద్ర సింగ్ (15), అభిమన్యు (13), రితేందర్ సింగ్ సోధి (11) విఫలం కాగా.. సత్నమ్ సింగ్ (32), ప్రిన్స్ పర్వాలేదనిపించాడు. టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ నేతృత్వంలో బరిలోకి దిగిన నింజాస్‌కు ఈ టోర్నీలో ఇది తొలి ఓటమి.ఈ టోర్నీలో దేశీయ ఆటగాళ్లతో పాటు పలువురు దేశ, విదేశీ స్టార్లు కూడా పాల్గొంటున్నారు. రాస్ టేలర్, తిలకరత్నే దిల్షాన్, ఇర్ఫాన్ పఠాన్, మాంటీ పనేసర్, ఉపుల్ తరంగ, సనత్ జయసూర్య, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ తదితర ఇంటర్నేషనల్ స్టార్లు వివిధ టీమ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## భారత స్టార్ షట్లర్ల దూకుడు.. ప్రీక్వాకర్ ఫైనల్‌కు పీవీ సింధు, ప్రణయ్



బాసెల్: బాసెల్‌లో జరుగుతున్న స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్స్ ఫైనలిస్ట్ చైనాకు చెందిన షి యు క్విని ఓడించి పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్, పురుషుల సింగిల్స్ ప్రారంభ రౌండ్లో 2018 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత అయిన షి యు క్విపై 21-17 19-21 21-17 తేడాతో విజయం సాధించి రెండో గేమ్ పతనం నుండి కోలుకుని తన మంచి పరుగు కొనసాగించాడు.ఇక, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన హైదరాబాద్ స్టార్ షట్లర్ పివి సింధు కూడా తన టైటిల్ డిఫెన్స్‌ను సానుకూలంగా ప్రారంభించింది. మహిళల సింగిల్స్‌లో లాప్-సైడ్ ప్రారంభ రౌండ్‌లో స్విట్జర్లాండ్‌కు చెందిన జెంజిరా స్టాడెల్మాన్‌ను 21-9 21-16 తేడాతో ఓడించింది. ప్రణయ్ తదుపరి ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పోపోవ్తో తలపడగా, సింధు 2022 ఆసియా టీమ్ ఛాంపియన్షిప్లో బంగారు పతకాన్ని గెలుచుకున్న జట్టులో భాగమైన ఇండోనేషియాకు చెందిన 20 ఏళ్ల పుత్రి కుసుమ వర్ధానీతో తలపడనుంది.అలాగే గురువారం కిదాంబి శ్రీకాంత్ హాంకాంగ్‌కు చెందిన లీ చెయుక్ యియుతో తలపడనున్నాడు. జాతీయ ఛాంపియన్ మిథున్ మంజునాథ్ చైనీస్ తైపీకి చెందిన చియా హావో లీతో తలపడగా, పురుషుల విభాగంలో రెండో సీడ్ సాత్విక్సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి తైవాన్కు చెందిన ఫాంగ్-చిహ్ లీ, ఫాంగ్-జెన్ లీతో తలపడనున్నారు.

## ఇకపై టాస్ గెలిచాకే.. ఐపీఎల్ నిబంధనల్లో మార్పులు



న్యూఢిల్లీ: ఐపీఎల్ కెప్టెన్లు ఇక టాస్ పడ్డాక తుది జట్లను ప్రకటించవచ్చు. ఈ మేరకు నిబంధనల్లో బీసీసీఐ మార్పులు చేసింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం కెప్టెన్లు టాస్కు ముందే తుది జట్టు వివరాలను ప్రకటించాలి. ''రెండు జట్ల కెప్టెన్లు.. 11 మందితో కూడి తుది జట్టు, అయిదుగురు సబ్‌స్టిట్యూట్ల వివరాలను టాస్ తర్వాత లిఖిత పూర్వకంగా ఐపీఎల్ మ్యాచ్ రిఫరీకి అందించవచ్చు. ముందు తుది జట్టును వెల్లడించినా.. మ్యాచ్ ఆరంభానికి ముందు ప్రత్యర్థి కెప్టెన్ అనుమతి లేకుండా మార్పులు చేసుకోవచ్చు'' అని బీసీసీఐ తెలిపింది. నిబంధనల మార్పుతో టాస్ ఆధారంగా తుది జట్టును ఎంచుకోవడానికి అవకాశం లభించింది.

## విరాట్ కోహ్లి అత్యధిక పరుగులు చేస్తాడు: ఆకాశ్ చోప్రా



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ ముగిసింది. ఇక, ఐపీఎల్ సందడి షురూ కానుంది. మార్చి 31 నుంచి ప్రారంభంకానున్న ఐపీఎల్-16 సీజన్ దాదాపు రెండు నెలలపాటు అలరించనుంది. ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడిన టీమ్‌ఇండియా ఆటగాళ్లు ఈ మెగా టోర్నీకి సిద్ధమవుతున్నారు. మరికొన్ని రోజుల్లో తమ తమ ఫ్రాంచైజీలు ఏర్పాటు చేసిన శిబిరాల్లో చేరిపోనున్నారు. ఇదిలా ఉండగా, గతేడాది ఐపీఎల్లో 22.73 సగటుతో 341 పరుగులు చేసిన విరాట్ కోహ్లి.. ఈ సారి అంతకంటే మెరుగైన ప్రదర్శన చేస్తాడని టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్లో విరాట్ కోహ్లి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలుస్తాడని చెప్పాడు.కోహ్లి, డుప్లెసిస్ ఓపెనింగ్ చేయాలని, రజత్ పాటిదార్ని ఫస్ట్ డౌన్‌లో పంపాలని సూచించాడు.'ఆర్సీబీలో డుప్లెసిస్, విరాట్ కోహ్లిలలో ఎవరు అత్యధిక పరుగులు చేస్తారని ప్రశ్నిస్తే.. నేను కోహ్లి వైపు మొగ్గుచూపుతాను. గతేడాది విరాట్ ఆశించిన మేరకు పరుగులు చేయలేదు. ప్రతి సంవత్సరం అలా జరగదు. అతను ఈ సారి రాణిస్తాడు. ఆర్సీబీ టీమ్ కాస్త బలంగా కనిపిస్తోంది. డుప్లెసిస్ రూపంలో వారికి చాలా మంచి కెప్టెన్ ఉన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్ విషయానికొస్తే.. డుప్లెసిస్తో కలిసి విరాట్ కోహ్లి ఓపెనింగ్ చేయాలి. మూడో స్థానంలో రజత్ పాటిదార్ను పంపించాలి. తర్వాత మ్యాక్స్వెల్, మహిపాల్ లోమ్రార్, షాబాజ్ అహ్మద్, దినేశ్ కార్తిక్ ఆడాలి. విల్ జాక్స్ స్థానంలో మైఖేల్ బ్రేస్వెల్‌ను తీసుకుని ఆర్సీబీ మంచి పని చేసింది. బ్రేస్వెల్ దూకుడుగా, టీ20 క్రికెట్‌ని అర్థం చేసుకుని ఆడతాడు' అని ఆకాశ్ చోప్రా అన్నాడు.

## టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో.. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో నిఖత్ జరీన్..

హైదరాబాద్: మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ సత్తా చాటుతోంది. రింగ్లో మెరుపులా కదులుతూ బలమైన పంచ్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నది. మహిళల 50 కేజీల విభాగంలో



తలపడుతున్న నిఖత్.. ఇవాళ సెమీఫైనల్ బౌట్లో కూడా తన పంచ్ పవర్ చూపించింది. కొలంబియన్ బాక్సర్ ఇంగ్రిత్ లొరెనా వాలెన్షియా విక్టోరియాపై 5-0 తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది.గత ఆదివారం రెండో రౌండ్లో ఆఫ్రికా ఛాంపియన్ బోలమ్ రుమేసా (అల్జీరియా)పైన, మంగళవారం ప్రీక్వార్టర్స్లో మెక్సికో బాక్సర్ పాట్రీషియా అల్వార్వెన కూడా నిఖత్ దూకుడు ప్రదర్శించి 5-0 తేడాతో విజయాలు సాధించింది. ప్రత్యర్థులపై ముష్టిఘాతాలు కురిపిస్తూ ఏకపక్షంగా గెలుపు సాధించడం నిఖత్ ప్రత్యేకతగా మారిపోయింది.

---

# ఓ దర్శకుడు అందరి ముందు నన్ను అవమానించాడు: నాని



సినిమాపరిశ్రమలో తనకు ఎదురైన సవాళ్లపై నటుడు నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలోకి వచ్చిన కొత్తలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. మరీ, ముఖ్యంగా ఓ దర్శకుడు తనని అందరి ముందు అవమానించాడని చెప్పారు. ''ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చారు కదా.. మొదట్లో ఏమైనా కష్టంగా అనిపించిందా?'' అని విలేకరి ప్రశ్నించగా.. ''కష్టంగా అనిపించింది. ఎందుకంటే ఇక్కడ ఏం జరుగుతుంది? ఎలా జరుగుతుంది? అనేది మొదట అర్థం కాదు. సాయం చేయడానికి ఇక్కడ ఎవరూ లేరు. మనం నేర్చుకుంటున్న సమయంలోనే కాస్త ఇబ్బందిగా ఉండొచ్చు కానీ, దాని తర్వాత వచ్చే సక్సెస్ ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. నేను ఎన్నో సవాళ్లు, తిరస్కరణలు ఎదుర్కొన్నా. ఆ వివరాలు ఇప్పుడు చెప్పాలనుకోవడం లేదు. సినీ పరిశ్రమలో ఉన్న ఎంతోమందితో పోలిస్తే నేను పెద్దగా ఇబ్బందులు ఎదుర్కొలేదని భావిస్తుంటా. నాకంటే ఇంకా ఎక్కువ ఇబ్బందులు పడిన వాళ్లు నాకు తెలుసు''''ఒకవేళ నువ్వు (విలేకరినుద్దేశించి) గనుక అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉండీ.. అందులోనూ క్లాప్ అసిస్టెంట్‌గా ఉంటే ఇలాంటి ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎవరైనా సరే.. నీకు ఏదైనా చెప్పేయొచ్చని అనుకుంటారు. ఇష్టం వచ్చినట్లు మాటలు అంటారు. వాళ్లందరికీ గట్టిగా సమాధానం చెప్పాలని ఉన్నా.. అన్నింటినీ దిగమింగక తప్పదు. అలాంటి ఎన్నో ఇబ్బందులు నేను ఎదుర్కొన్నా. క్లాప్‌బోర్డ్ ఆలస్యమైనాఏదో ఒకటిఅనేవారు.మాటలు పడిన ందుకు నేను ఎప్పుడూ బాధపడలేదు. కానీ, ఓ దర్శకుడు మాత్రం సెట్‌లో అందరి ముందు నన్ను అవమానించాడు. నేను ఎప్పటికీ దర్శకు డిని కాలేనని అన్నాడు. ఆ మాట నన్ను తీవ్ర మనోవేదనకు గురి చేసింది. అలాంటి ఎన్నో విమర్శలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చా. స్టార్‌ని అయ్యాక ఆ దర్శకుడిని కలిశా. అప్పుడు కూడా మా చుట్టూ ఉన్న వాతావరణం చెప్పుకోదగిన విధంగా లేదు'' అని నాని వివరించారు.

## 'విరూపాక్ష' టీమ్‌పై నటి సంయుక్త ఆగ్రహం



'విరూపాక్ష' టీమ్ నటి సంయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. మాటిచ్చారు సరే.. నెరవేర్చలేదెందుకు అని ప్రశ్నించింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ ఎస్వీసీసీని ట్యాగ్ చేస్తూ తన నిరాశను బయటపెట్టింది. ''విరూపాక్ష'తో నా ప్రయాణాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాను. అద్భుతమైన నటీనటులు, టెక్నీషియన్స్‌తో పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా. అయితే, ఎస్వీసీసీ.. ఎందుకంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. విరూపాక్షలో నా పాత్రను పరిచయం చేస్తూ ఉగాది రోజున ఓ పోస్టర్‌ను రిలీజ్ చేస్తామని మాటిచ్చారు. మరి అదెక్కడ?'' అని ఆమె ప్రశ్నించింది.దీనిపై స్పందించిన చిత్ర నిర్మాణ సంస్థ ఆమెకు క్షమాపణలు చెప్పింది. సరైన సమయం చూసి త్వరలోనే పోస్టర్ రిలీజ్ చేస్తామని పేర్కొంది. నిర్మాణ సంస్థ స్పందనతో కాస్త శాంతించిన ఆమె.. ''సరే.. నేను ఎదురు చూస్తుంటా'' అని బదులిచ్చింది. సంయుక్త ట్వీట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు.. సంయుక్త నిజంగానే ఆగ్రహంగా ఉన్నారా? లేదా ఇదంతా కేవలం ప్రమోషన్ కోసమేనా? అని మాట్లాడుకుంటున్నారు.'సార్' తర్వాత సంయుక్త నటిస్తున్న చిత్రమిది. సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా కార్తిక్ దండు దీన్ని రూపొందిస్తున్నారు. ఎస్వీసీసీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ దీన్ని నిర్మిస్తున్నారు. మూఢ నమ్మకాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కిన్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. వేసవి కానుకగా వచ్చే నెలలో ఈ సినిమా విడుదల కానుంది.

మనం సినిమా

manamcinema

## బ్రహ్మానందంకు 'చిరు' సత్కారం!



క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెరకెక్కించిన 'రంగమార్తాండ' సినిమా ఉగాది కానుకగా బుధవారం జనం ముందుకు వచ్చింది. మరాఠీ చిత్రం 'నటసమ్రాట్'కు రీమేక్ అయిన ఈ సినిమాలో టైటిల్ రోల్ ను ప్రకాశ్ రాజ్ పోషించగా, ఆయన ఆప్త మిత్రుడు చక్రపాణి పాత్రను బ్రహ్మానందం చేశారు. వేయికి పైగా చిత్రాలలో వినోదాన్ని పండించిన బ్రహ్మానందం తన ఇమేజ్ కు పూర్తి భిన్నంగా ఇందులో కరుణ రసాన్ని అద్భుతంగా పోషించారంటూ విమర్శకులు సైతం ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. ఇందులో నటించిన ప్రధాన పాత్రధారులందరూ ఒక ఎత్తు అయితే బ్రహ్మానందం మరో ఎత్తు అని, ఆయన ఏటికి ఎదురీది ప్రేక్షకుల కళ్ళలో నీళ్ళు తెప్పించారని అంటున్నారు. ఇదిలా ఉంటే 'రంగమార్తండ' సినిమా కోసంలక్ష్మీ భూపాల రాసిన షాయరీని చిరంజీవి పాడారు. అలానే బ్రహ్మానందం పాత్రకు లభిస్తున్న ప్రశంసల పట్ల చిరంజీవి సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.బ్రహ్మానందం కెరీర్ ప్రారంభరోజులలోచిరంజీవి ఆయన్ని ఎంతో ప్రోత్సహించారు. ఇవాళ నటుడిగా బ్రహ్మానందంలోని మరో కోణాన్ని చూసిన ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తన తనయుడు రామ్ చరణ్‌తో కలిసి చిరంజీవి బ్రహ్మానందాన్ని ప్రత్యేకంగా శాలువతో సత్కరించి, అభినందించారు. దానికి సంబంధించిన ఫోటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

## అప్పటి నుంచే నా సినిమాల్లో నిజమైన బంగారు ఆభరణాలు వాడుతున్నా: గుణశేఖర్





గుణశేఖర్ దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'శాకుంతలం'. ఈ సినిమాలో సమంత లుక్‌కు సంబంధించిన కొత్త ఫొటోలను చిత్రబృందం రిలీజ్ చేసింది. వజ్రాభరణాలతో హీరోహీరోయిన్లు మెరిసిపోతున్న ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. ఈ సందర్భంగా 'శాకుంతలం'లో వాడిన ఆభరణాల వివరాలను దర్శకుడు గుణశేఖర్ తెలిపారు. 'దాన వీర శూర కర్ణ' స్ఫూర్తితో తన చిత్రాల్లో నిజమైన ఆభరణాలు మాత్రమే వాడుతున్నట్లు చెప్పారు. ''శాకుంతలం'లో ప్రధాన పాత్రధారుల కోసం రూ.14 కోట్లు విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు వాడాం. ఇందు కోసం సుమారు 15 కిలోల బంగారం వినియోగించాం. 'దాన వీర శూర కర్ణ'లో ఎన్టీఆర్ వాడిన బంగారు కిరీటం స్ఫూర్తితో నా చిత్రాల్లోనూ నిజమైన బంగారు ఆభరణాలే వాడుతున్నాం. ఈ సినిమాలో శకుంతల, దుష్యంతుడు, మేనక పాత్రలకు ప్రముఖ డిజైనర్ నీతూ లుల్లా సారథ్యంలో ఆభరణాలను తయారు చేశారు. వసుంధర జువెలర్స్ 7 నెలలు శ్రమించి వీటిని తీర్చిదిద్దారు. ఇక కథానాయిక సమంత కోసం 14 రకాల ఆభరణాలను తయారు చేయించాం'' అని గుణశేఖర్ తెలిపారు. పూర్తిగా చేతితో తయారు చేసిన ఆభరణాలు సినిమాలోని పాత్రలకు మరింత అందాన్ని, రాజసాన్నితీసుకొచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా రూపొందిన 'శాకుంతలం' ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. దుష్యంతుడి పాత్రలో దేవ్ మోహన్ నటించారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో మోహన్ బాబు, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# యంగ్ టైగర్ కొత్త సినిమా షురూ..



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొత్త సినిమా మొదలైంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా పూజా కార్యక్రమం గురువారం ఉదయం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, కొరటాల శివ, జాన్వీకపూర్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత కల్యాణ్ రామ్ తదితరులు సందడి చేశారు. దర్శకధీరుడు రాజమౌళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం.. నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి.. చిత్రబృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఎన్టీఆర్-జాన్వీకపూర్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు జక్కన్న క్లాప్ కొట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'ఎన్టీఆర్30' పూజా కార్యక్రమంలో జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిత్రబృందంతో ఆమె కలివిడిగా కనిపించారు. తన అభిమాన నటుడు ఎన్టీఆర్ని కలిసిన సమయంలో ఆమె ఆనందం మరోస్థాయిలో ఉంది. ఎన్టీఆర్ పలకరించగా.. ఆమె ఎంతో ఆనందించారు. కాసేపు సరదాగా మాట్లాడారు. అలాగే రాజమౌళితోనూ ఆమె ముచ్చటించారు.''జనతా గ్యారేజ్ తర్వాత నా సోదరుడు, ఈ జనరేషన్‌లో ఉన్న గొప్ప నటుల్లో ఒకరైన ఎన్టీఆర్‌తో కలిసి మరోసారి వర్క్ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంత బ్యాక్‌డ్రాప్‌లో దీన్ని రూపొందిస్తున్నాం. ఈ కథలో మనుషుల కంటే ఎక్కువగా మృగాళ్లు ఉంటారు. భయం అంటే ఏమిటో వాళ్లకు తెలియదు. దేవుడంటే భయం లేదు. చావు అంటే భయం లేదు. కానీ.. వాళ్లకు ఒకే ఒక్కటంటే భయం. ఆ భయమేంటో మీకు తెలిసే ఉంటుంది. ఇదే ఈ సినిమా బ్యాక్‌డ్రాప్. భయం ఉండాలి. భయం అవసరం. భయపెట్టడానికి ప్రధాన పాత్ర ఏ స్థాయికి వెళ్తుందనేది.. ఒక ఎమోషనల్ రైడ్. దీన్ని భారీ స్థాయిలో తీసుకువస్తున్నాం. నా కెరీర్‌లో ఇది బెస్ట్ అవుతుందని అందరికీ మాటిస్తున్నా. ఈ కథ చెప్పిన వెంటనే.. ''ఫైర్‌తో రాశారు సర్'' అని అనిరుధ్ అన్నాడు. ఇలాంటి టీమ్‌తో కలిసి పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అని కొరటాల శివ వివరించారు.

## నరేష్ నిత్య పెళ్ళికొడుకు.. వాడి రేంజ్ కత్తి నేను కాదు



సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన కామెడీతో నవ్వించడమే కాదు.. తన నటనతో కన్నీళ్లు కూడా పెట్టించగలడు. ప్రస్తుతం సపోర్టివ్ క్యారెక్టర్స్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన పలు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నాడు. ఇక సినిమాల్లో ఎంతో కామెడీ చేస్తాడో.. స్టేజిపై కూడా తనదైన మాటలతో నవ్విస్తూ ఉంటాడు. తాజాగా రాజేంద్ర ప్రసాద్, నరేష్, పవిత్ర ప్రధాన పాత్రల్లో నటించిన సెకండ్ ఇన్నింగ్స్ సినిమా ప్రెస్ మీట్‌లో నరేష్‌పై మంచి సెటైర్లు వేసి పాత్రికేయలను కడుపుబ్బా నవ్వించాడు. ఈ సినిమా షూటింగ్‌లో జరిగిన పెళ్లి వీడియోనే నరేష్ పోస్ట్ చేస్తూ పవిత్రతో తనకు వివాహం అయ్యిందని, తమను ఆశీర్వదించమని కోరిన సంగతి తెల్సిందే. ఆ తరువాత ఈ పెళ్లి గురించి ఒక ప్రెస్ మీట్ పెట్టి అందరి డౌట్స్ క్లియర్ చేస్తానని చెప్పిన నరేష్.. ఆ విషయాలను ఈ ప్రెస్ మీట్‌లో చెప్పుకొచ్చాడు. ఇక తాజాగా అన్ని మంచి శకునములే సినిమా ప్రెస్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్, నరేష్ వరుస పెళ్లిళ్ల గురించి వేసిన సెటైర్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. 'వాడు కత్తే.. నరేష్ మామూలోడు కాదు.. కత్తి.. మీ అందరికి తెలుసు.. బాగా కత్తి వాడు. వాడి రేంజ్ కత్తి నేను కాదు.. మేమిద్దరం బ్రదర్స్ లాంటివాళ్ళం. అందుకే జోక్‌గా అంటున్నా.. చూశారా ఎప్పుడు పెళ్లి కొడుకులానే ఉంటాడు.. ఇప్పుడు కూడా పెళ్లి కొడుకులానే ఉన్నాడు.. అని అనగానే.. నరేష్ స్పందిస్తూ.. పెళ్లి కొడుకులా ఉండడం వేరు.. నిత్యం పెళ్ళికొడుకులా ఉండడం వేరు అని చెప్పుకొచ్చాడు. దీంతో రాజేంద్ర ప్రసాద్.. నరేష్ నిత్య పెళ్లి కొడుకువు నువ్వు' అంటూ చెప్పుకురావడంతో అక్కడ ఉన్న పాత్రికేయులు అందరు పొట్ట పట్టుకొని నవ్వడం మొదలుపెట్టారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇకపోతే నరేష్- పావిత్ర పెళ్లిపై ఇంకా క్లారిటీ రాలేదు. నరేష్ మూడో భార్య రమ్య విడాకులు ఇవ్వకపోవడంతో ఇంకా డీలే అయ్యే అవకాశం ఉందట. మరోపక్క రమ్య తనకు విడాకులు వద్దు అని చెప్పడంతో వీరి పెళ్లి అసలు జరుగుతుందా..? లేదా..? అనేది మిస్టరీగా మారింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sri Vari Printers, D.No: 13-7-954/C1, Korlagunta, Tirupathi-517501, Chittor District (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.